Bhavani Publication Trust https://prajatheerpudaily.com

# ప్రజాతీర్పు
The people's Verdict
తెలుగు జాతీయ దినపత్రిక

రిపోర్టర్లు కావలెను
అధునాతన సాంకేతికతతో..
ఎప్పటి వార్తలు అప్పుడు అందించేందేందుకు
మీ ముందుకు వచ్చిన
ప్రజా టెలివిజన్
యూట్యూబ్ చానల్‌లో పని చేయుటకు
రిపోర్టర్లు కావలెను. ఎలాంటి టార్గెట్లు ఉండవు.
నిత్యనూతనంగా వార్తలు, లైవ్‌లు అందించడమే మీ పని..
సంప్రదించండి: 8309979541, 9494659622
ప్రజా TV PRAJA TELEVISION The People's Favour
మా యూట్యూబ్ చానల్‌ను సపోర్ట్ చేయండి 8309979541
ప్రజా టెలివిజన్ తాజా వార్తలు, అప్‌డేట్, లైవ్ ప్రోగ్రామ్‌ల కోసం లైక్, షేర్, సబ్‌స్క్రైబ్

సంపుటి : 26 | సంచిక : 302 | హైదరాబాద్ | గురువారం 17 సెప్టెంబరు 2026 | పేజీలు : 8 | వెల : రూ. 1/-

Cerculated From : KARIMNGAR, HYDERABAD, WARAGAL, RANGAREDDY, MAHABOOBNAGAR, THIRUPATI, GUNTUR, KURNOOL, ANATAPUR, VISAKAPATNAM, CHENNAI, BANGALOOOR



## నాకు ఒక్క ఇంచు కూడా ఇనాం భూమి లేదు

### జగదీశ్‌రెడ్డి స్పష్టీకరణ

హైదరాబాద్, సెప్టెంబరు 16 (ప్రజాతీర్పు)

తనకు ఒక్క ఇంచు కూడా ఇనాం భూమి గానీ, ఎసైన్డ్ గానీ, మరోటి గానీ లేవని... పూర్తిగా పట్టా భూమి అని మాజీ మంత్రి, భారాస సీనియర్ నేత జి.జగదీశ్‌రెడ్డి స్పష్టంచేశారు. అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి తనపై చేసిన వ్యాఖ్యలపై బుధవారం ఆయన తెలంగాణ భవన్‌లో విలేకరుల సమావేశంలో స్పందించారు. "నాకున్న ఆస్తుల గురించి 2018, 2023 ఎన్నికల అఫిడవిట్‌లలో అన్ని వివరాలు స్పష్టంగా ఉన్నాయి. ముఖ్యమంత్రి అవగాహన లేకుండా ఏదేదో మాట్లాడారు. నేను 2015-16లోనే అక్కడ భూములు కొన్నా. అప్పటికి ధరణి లేనే లేదు. ఇలాంటప్పుడు ధరణిని అడ్డంపెట్టుకొని భూములు సొంతం చేసుకున్నామని సీఎం చేసిన ఆరోపణకు

-2వ పేజీలో

## పొరపాట్లు జరిగాయి పరిష్కరిస్తాం

### ఆ బాధ్యత ప్రభుత్వానిదే.. ఇందుకోసం ప్రత్యేక కార్యాచరణ

- అసెంబ్లీలో 22ఏపై చర్చ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి
- 12 రకాల అంశాలను ప్రభుత్వం గుర్తించింది
- యూఎల్‌సీ భూముల క్రమబద్ధీకరణకు త్వరలో పాలసీ
- అధీకృత లేఅవుట్లలోని ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణకు కొత్త పథకం
- సింగరేణి బొగ్గు గని ప్రాంతాల్లో దరఖాస్తులకు జిల్లా స్థాయిలో కమిటీ
- వివిధ జీవోల కింద ఉన్న దరఖాస్తులకు త్వరలో పరిష్కారం
- ఇందిరమ్మ పథకంలో నిర్మించిన ఇళ్ల విక్రయానికి ఐదేళ్ల సీలింగ్
- ప్రైవేటు పట్టా భూముల్లో నాలా సమస్యతో నిలిచిన వాటికి రిలీఫ్
- త్వరలో ప్రభుత్వ భూముల్లోని ఆక్రమణలు, లేఅవుట్‌ల క్రమబద్ధీకరణ

నిషేధిత భూముల సమస్యలను పరిష్కరిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. 22ఏ జాబితాలో చేర్చిన వివరాల్లో పొరపాట్లు జరిగాయని చెప్పారు. వాటిని పూర్తిగా సవరించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని అన్నారు. ఈ సమస్యలన్నింటినీ పరిష్కరించేందుకు ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. బుధవారం శాసనసభలో 22ఏపై చర్చలో భాగంగా ఆయన ఈ విషయాలు వెల్లడించారు. '22ఏ కింద మొత్తం 1.02 కోట్ల ఎకరాలకు పైగా భూమి ఉంది. ఇందులో సింహభాగం అటవీ, అసైన్డ్, ఇతర ప్రభుత్వ భూములే. వీటిని నిషేధిత జాబితా నుంచి తొలగించలేం.

హైదరాబాద్, సెప్టెంబరు 16 (ప్రజాతీర్పు)

వాటిని తొలగించాలని కేసీఆర్, హరీశ్‌రావు లేఖ మీద రాసి ఇవ్వాలి. అప్పుడు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది. ఆగస్టు 30, 2026 నాటికి 22ఏ జాబితాలో 1,02,05,250 ఎకరాలు ఉండగా, అందులో ప్రైవేట్ భూమి 3,73,980 ఎకరాలే. 22ఏలో ఉన్న మొత్తం విస్తీర్ణాన్ని ప్రైవేట్ పట్టా భూమిగా చూపడం సరికాదు. టీజీఐఐసీ, ఇతర భూములపై వచ్చే సారి బడ్జెట్ సెషన్‌లో వివరాలు బయటపెడతా. ఇప్పుడు కేవలం రెవెన్యూలో ధరణిలో పార్ట్1 వివరాలు మాత్రమే బయటపెట్టా. సభలో వారుండాలి.. వారి ఎదురుగా నేనే మాట్లాడతా.. నా

-2వ పేజీలో





## నూతన సాంకేతికతల్లో భారత్ అగ్రస్థానానికి చేరాలి

### సెమీకండక్టర్ రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రధాని మోదీ ఆకాంక్ష

న్యూఢిల్లీ, సెప్టెంబరు 16 (ప్రజాతీర్పు)

అభివృద్ధి చెందుతున్న నూతన సాంకేతికతల విషయంలో భారత్ అగ్రస్థానానికి చేరాలని ప్రధాని నరేంద్ర మోదీ ఆకాంక్షించారు. బుధవారం ఢిల్లీలో ప్రముఖ సీఈఓలతో జరిగిన సెమీకండక్టర్ రౌండ్‌టేబుల్ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. భారతదేశ సాంకేతిక భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ప్రభుత్వం, సెమీకండక్టర్ పరిశ్రమ మధ్య సన్నిహిత సహకారం అవసరమని తేల్చిచెప్పారు. దేశానికి ప్రతిభ, సాంకేతిక పరిజ్ఞాన స్వీకరణ, మౌలిక సదుపాయాల విషయంలో బలమైన పునాది ఉందని గుర్తుచేశారు. సెమీకండక్టర్ రంగంలో భారత్ సాధించిన గణనీయమైన పురోగతిని ప్రస్తావించారు. ఈ వ్యవస్థ

-2వ పేజీలో

## భారత యుద్ధనౌకను ఢీకొట్టిన పాక్ నౌక

### ఉత్తర అరేబియా సముద్రంలో ఘటన

తీవ్రంగా స్పందించిన భారత విదేశాంగ శాఖ
పాక్ దౌత్యవేత్తను పిలిపించి నిరసన




ఉత్తర అరేబియా సముద్రంలోని అంతర్జాతీయ జలాల్లో భారత నావికా దళానికి చెందిన యుద్ధ నౌకను పాకిస్తాన్ నౌకాదళానికి చెందిన నౌక ఢీకొట్టడం సంచలనాత్మకంగా మారింది. ఈనెల 15న సాయంత్రం ఈ ఘటన చోటుచేసుకున్నట్లు అధికార వర్గాలు తెలియజేశాయి.

-2లో

## సిట్టింగ్ జడ్జితో విచారణకు సిద్ధమా?

### మా ఆస్తులు, మీ ఆస్తులు, ధరణి, భూభారతి వ్యవహారాలపై విచారణ జరిపించండి

- సీఎం రేవంత్‌రెడ్డికి బీఆర్ఎస్ఎల్పీ ఉప నేత హరీశ్‌రావు సవాల్
- ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తుంటే సమాధానం చెప్పే ధైర్యం లేకే వ్యక్తిగత ఆరోపణలు
- డైవర్షన్ డ్రామాలతో ఎదురుదాడి.. దబాయింపులు, బెదిరింపులు
- రేవంత్ కుటుంబం పేరిట 308ఎకరాలు ఉన్నట్లు ప్రాథమిక సమాచారం
- 22ఏ తప్పిదం అని ఒప్పుకున్నావ్.. బాధ్యులపై చర్యలు ఎందుకు లేవు?
- మీ ఇల్లు నిషేధిత జాబితా నుంచి తొలగించినట్టే సామాన్యుడికీ ఊరట కల్పించాలి



హైదరాబాద్, సెప్టెంబరు 16 (ప్రజాతీర్పు)

'నాతో పాటు మా పార్టీ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఇతర బీఆర్ఎస్ నేతలపై చేసిన ఆరోపణలన్నింటినీ నిరూపించండి. మా ఆస్తులు, మీ ఆస్తులు, మీ కుటుంబ సభ్యుల ఆస్తులు.. 2020 నుంచి ఇప్పటి వరకు ధరణి, భూభారతిలో

-2వ పేజీలో



## నగర సమస్యలకు సమగ్ర, దీర్ఘకాలిక పరిష్కారాలు అవసరం: కేటీఆర్

ప్రజలు తమ సమస్యలను నాయకుల దృష్టికి తీసుకొచ్చినప్పుడు తాత్కాలికంగా స్పందించడం కాకుండా సమగ్ర, దీర్ఘకాలిక పరిష్కారాలపై దృష్టి సారించాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. న్యూఢిల్లీలోని ఇండియా హ్యాబిటాట్ సెంటర్‌లో జనాగ్రహ ఆధ్వర్యంలో నిర్వహించిన 'షెహెరోన్ పే చర్చా' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

(ప్రజాతీర్పు ప్రతినిధి, హైదరాబాద్)

భారత నగరాలను ప్రజలకు మరింత అనుకూలంగా తీర్చిదిద్దేందుకు చేపట్టాల్సిన చర్యలపై నిర్వహించిన ప్యానెల్ చర్చలో కేటీఆర్ పాల్గొన్నారు. పార్లమెంటేరియన్లు మహువా మాజి, ఎస్. నిరంజన్ రెడ్డి, జనాగ్రహ సీఈఓ శ్రీకాంత్ విశ్వనాథన్‌తో కలిసి జరిగిన చర్చలో తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన విధానాలు, పట్టణాభివృద్ధి కార్యక్రమాలను కేటీఆర్ వివరించారు. "ప్రజలు ఏదైనా సమస్యతో నాయకుల వద్దకు వచ్చినప్పుడు దానికి సమగ్ర, దీర్ఘకాలిక పరిష్కారం చూపించాలి. సమస్య వచ్చిన వెంటనే హడావుడిగా స్పందించడం, తాత్కాలిక చర్యలు చేపట్టడం సరిపోదు" అని కేటీఆర్ అన్నారు. హైదరాబాద్‌పై పెరుగుతున్న ఒత్తిడిని తగ్గించేందుకు అప్పటి తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన పలు కార్యక్రమాలను ఆయన

-2వ పేజీలో

## నెట్ జీరో సిటీగా ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి ప్రణాళికలు

### సింగపూర్ ప్రతినిధులకు వివరించిన సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్, సెప్టెంబరు 16 (ప్రజాతీర్పు)

భారత్ ఫ్యూచర్ సిటీని నెట్ జీరో సిటీగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. శాసనసభలో బుధవారం సింగపూర్ వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖకు చెందిన ఇంధన వాణిజ్య విభాగం శాశ్వత కార్యదర్శి అగస్టీన్ లీతో సీఎం సమావేశమయ్యారు. తెలంగాణలో సెమీకండక్టర్ల పరిశ్రమ ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నట్లు సింగపూర్

-2వ పేజీలో



## ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులను ప్రోత్సహించండి

### సింగపూర్ ప్రతినిధుల బృందాన్ని కోరిన మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్, సెప్టెంబరు 16 (ప్రజాతీర్పు)

భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేస్తున్న ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులు పెట్టేలా సింగపూర్ కంపెనీలను ప్రోత్సహించాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ఆ దేశ ప్రతినిధుల బృందాన్ని కోరారు. సచివాలయంలో సింగపూర్ వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వశాఖకు చెందిన ఇంధన వాణిజ్య విభాగం శాశ్వత కార్యదర్శి అగస్టిన్ లీతోపాటు ఆ దేశ ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం బుధవారం మంత్రి శ్రీధర్‌బాబుతో సమావేశమైంది. అనంతరం మంత్రి మాట్లాడుతూ.."సెమీ కండక్టర్ రంగంలో సింగపూర్‌కు ఉన్న సాంకేతిక, పారిశ్రామిక అనుభవాన్ని తెలంగాణకు అనుసంధానించాలి. రాష్ట్రంలో ఫ్యాబ్ పరిశ్రమలతోపాటు అనుబంధ పరిశ్రమలు, సరఫరా వ్యవస్థను అభివృద్ధి చేసేలా చొరవ చూపాలి. అంతర్జాతీయ భాగస్వామ్యాల

-2వ పేజీలో

# పొరపాట్లు జరిగాయి.. పరిష్కరిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

కళ్లలోకి చూడడానికి కూడా ధైర్యం రావొద్దు.. చూడాలంటే కూడా చేసిన దొంగతనాలకు ముక్కును నేలకు రాసి క్షమాపణ చెప్పాల్సిన పరిస్థితి ప్రత్యక్షంగా తీసుకువస్తా. నిజాం సర్కార్ ఇచ్చినదాన్ని పూర్తిగా లూటీ చేశారు.. జమీన్దార్, జాగిర్దార్‌లను లూటీ చేశారు. నిజాం పేదలు, దళితలులు, ఆదివాసులు, మైనారిటీలకు దక్కాల్సిన భూములను ఒకే కుటుంబం దోపిడీ చేసింది.

ప్రైవేటు భూమి 3.7 లక్షలకు సంబంధించి సమస్యలను పరిష్కరించేందుకు సీసీఎల్ఎ, న్యాయ కార్యదర్శి, ఐజీఆర్ఎస్ ఉన్నతాధికారితో కూడిన హైపవర్ ఆఫీసర్స్ కమిటీ ఏర్పాటు చేస్తున్నాం. నిషేధిత జాబితాలోని నిరుపేదలకు సంబంధించిన ఆస్తులపై 30 రోజుల్లోగా న్యాయం జరిగేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది. న్యాయమైన, చట్టబద్ధమైన అంశాల్లో నిరుపేదలకు అన్యాయం జరక్కుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటాం.

### 12 అంశాలకు పరిష్కారం..

ప్రధానంగా ప్రభుత్వం గుర్తించిన 12 అంశాలపై ప్రభుత్వం త్వరలోనే నిర్ణయం తీసుకుంటుంది.

అర్బన్ ల్యాండ్ సీలింగ్ (యూఎల్సీ) భూములు కేటగిరీలో పాక్షికంగా క్రమబద్ధీకరించిన, క్రమబద్ధీకరించని కాలనీలు, యూఎల్సీ మిగులు భూముల క్రమబద్ధీకరణ నిమిత్తం త్వరలోనే ప్రభుత్వం కొత్త విధానాన్ని ప్రవేశపెడుతుంది.

ఈ విధానం పెండింగ్‌లో ఉన్న పాత దరఖాస్తులతో పాటు కొత్త దరఖాస్తులన్నింటికీ వర్తిస్తుంది.

భూముల రిజిస్ట్రేషన్, క్రమబద్ధీకరణ ప్రక్రియలు రెండూ సమాంతరంగా, ఏకకాలంలో చేపడతాం.

అదీకృత లేఅవుట్లలోని ప్రభుత్వ భూములు, కాంపిటెంట్ అథారిటీలు (హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ, డీటీసీపీ) ఆమోదించిన లేఅవుట్లలో పెండింగ్‌లో ఉన్న రిజిస్ట్రేషన్ల దరఖాస్తులను పరిశీలించి, తగిన పరిష్కారం చూపేందుకు వారం రోజుల్లోగా ఒక సమగ్ర వ్యవస్థను ఏర్పాటు చేసి



సమస్యను పరిష్కరిస్తాం.

ఇలాంటి ఆస్తుల క్రమబద్ధీకరణ త్వరగా పూర్తి చేసేందుకు ప్రభుత్వం నూతన పథకాన్ని ప్రవేశపెడుతుంది.

సింగరేణి బొగ్గు గని ప్రాంతాల (కోల్ బెల్ట్) సమస్య కోసం జిల్లా స్థాయి ఉన్నతాధికార కమిటీని ఏర్పాటు చేస్తాం. ఈ కమిటీ పెండింగ్‌లో ఉన్న అన్ని దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించి నిర్దేశిత అర్హత ప్రమాణాల మేరకు పరిష్కరిస్తుంది.

### అసైన్డ్ భూములపై న్యాయ సమీక్ష

జీవో నంబర్ 59 సమస్యకు కన్వెయన్స్ డీడ్స్ (హక్కు బదిలీ పత్రాలు) జారీ చేసిన 1,22,280 దరఖాస్తులను నిర్దేశిత అర్హతల ప్రాతిపదికన తుది పరిశీలన జరిపి పరిష్కరించడానికి ప్రభుత్వం ఒక కమిటీని నియమిస్తుంది.

మిగిలిన 18,590 పెండింగ్ దరఖాస్తులు నూతన క్రబద్ధీకరణ విధానం కింద పరిష్కరిస్తాం.

జీవో నంబర్ 118 (ఎల్బీ నగర్ నియోజకవర్గం) సమస్య కింద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులన్నీ నిర్ణీత గడువులోగా పరిష్కరిస్తాం. పరిష్కారమైన అన్ని కేసులను వెంటనే సెక్షన్ 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగిస్తాం.

అసైన్డ్ భూములన్నీ తెలంగాణ అసైన్డ్ భూముల (బదిలీ నిషేధ) చట్టం 1977 పరిధిలోకి వస్తున్నందున, ఈ అంశంపై సమగ్ర న్యాయ సమీక్ష, విస్తృతస్థాయి సంప్రదింపులు జరిపి నిర్ణయం తీసుకుంటాం.

ఇందిరమ్మ పథకం కింద ప్రభుత్వం కేటాయించిన స్థలంలో ప్రభుత్వ ఖర్చుతో నిర్మించిన ఇళ్లు అత్యంత నిరుపేదల ఆస్తులకు సంబంధించినది అయినందున, దీనిపై విస్తృతస్థాయి సంప్రదింపులు జరుపుతాం.

### ఇందిరమ్మ ఇళ్లకు ఐదేళ్ల లాక్ ఇన్ పీరియడ్

ఇందిరమ్మ పథకం కింద లబ్ధిదారుని సొంత స్థలంలో ప్రభుత్వ ఖర్చుతో నిర్మించిన ఇళ్లను 5 సంవత్సరాల లాక్ఇన్ పీరియడ్ (లావాదేవీల నియంత్రణ గడువు) ముగిసిన తర్వాత క్రయవిక్రయాలకు అనుమతి మంజూరు చేస్తాం.

ప్రైవేటు పట్టా భూములు నాలా రుసుము చెల్లించని కేసులకు సంబంధించి నాలా చార్జీలు, స్టాంపు డ్యూటీ, రిజిస్ట్రేషన్ రుసుములను కలిపి క్రయ విక్రయాలకు అనుమతిస్తాం.

ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలు, అనధికార లేఅవుట్లు, కాలనీలకు సంబంధించి అనధికారిక లేఅవుదట్లు నూతన క్రమబద్ధీకరణ పథకం పరిధిలోకి తీసుకొస్తాం.

సికింద్రాబాద్ పరిధిలోని లీజ్ హోల్డ్ ఆస్తుల ఫ్రీహోల్డ్ క్రమబద్ధీకరణ కేసులను 30 రోజుల నిర్దిష్ట వ్యవధిలో పరిష్కరించేందుకు అధికారులతో కూడిన కమిటీని ఏర్పాటు చేస్తాం. స్వాతంత్ర సమరయోధులు, మాజీ సైనికుల అసైన్మెంట్ భూములు, భూదాన్ భూములకు సంబంధించి సమస్యలో నిరుపేద, బలహీన వర్గాల గృహ నిర్మాణ అవసరాల కోసం భూమిని, ఆర్థిక వనరులను సమీకరించే ఉద్దేశంతో ఈ భూములను దసమగ్ర ల్యాండ్ పూలింగ్ విధానం పరిధిలోకి తీసుకొస్తాం. ఈ విధానం ద్వారా సమీకరించిన నిధులను ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల్లోని నిరుపేద లబ్ధిదారులకు బలహీన వర్గాల గృహ నిర్మాణ పథకాలకు వినియోగిస్తాం..'అని ముఖ్యమంత్రి చెప్పారు.



## నాకు ఒక్క ఇంచు కూడా ఇనాం భూమి లేదు

(మొదటి పేజీ తరువాయి)

అర్థమే లేదు. కేసీఆర్‌కు వెయ్యి ఎకరాలున్నాయని గతంలో రేవంత్‌రెడ్డి చేసి న ఆరోపణ అసత్యమని.. అసెంబ్లీలోనే సీఎం ఒప్పుకొన్నారు. మాపై ఎన్ని ఆరోపణలు చేసినా ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉంటాం" అని జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు.

మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ... 'కేసీఆర్‌కు ఉన్నది 67 ఎకరాలని ఒకవైపు సీఎం చెబుతూనే.. మరోవైపు 350 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని అంటున్నారు. కేసీఆర్, హరీశ్‌రావు కుటుంబాలపై ముఖ్యమంత్రి చేసిన ఆరోపణలు పూర్తిగా అసత్యాలు. సిరిసిల్లలో తోట ఆగయ్యకు మాజీ నక్సలైట్ల పునరావాసం కింద 2002లో అప్పటి ప్రభుత్వం ఇచ్చిన మూడున్నర ఎకరాల భూమిని ఇప్పుడు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం లాక్కొంది" అని విమర్శించారు. తన పేరుతో ఉన్న చాలా భూములు 2014కు ముందే కొనుగోలు చేశానని ఎమ్మెల్సీ కె.నవీన్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో చట్టప్రకారం తన ఆస్తులు, భూముల వివరాలను అధికారికంగా ప్రకటించానని ఆయన వెల్లడించారు.

## భారత యుద్ధనౌకను ఢీకొట్టిన పాక్ నౌక

న్యూఢిల్లీ, సెప్టెంబరు 16 (ప్రజాతీర్పు)



భారత యుద్ధనౌక సాధారణ నిఘా విధుల్లో ఉండగా, పీఎన్ఎస్ హున్హైన్ అనే పాక్ పెట్రోలింగ్ నౌక దానిని వెంబడించింది. ప్రమాద సంకేతాలను తెలియజేయ డానికి ఉపయోగించే ఛానల్ 16 (సముద్ర రేడియో ఛానల్) ద్వారా పదేపదే హెచ్చరికలు జారీ చేసినట్లు అధికార వర్గాలు తెలిపాయి. అయినప్పటికీ పాకిస్తాన్ నౌక అకస్మాత్తుగా వేగం పెంచి, భారత యుద్ధనౌక ముందు భాగాన్ని కుడి వైపున ఢీకొట్టింది. చివరికి పాకిస్తానీ నౌక ముందు భాగం భారత యుద్ధనౌకను తాకింది. అయితే, భారత యుద్ధనౌకకు ఎలాంటి నష్టం వాటిల్లలేదని సమాచారం. ఈ సంఘటన తర్వాత కూడా భారత యుద్ధనౌక తన కార్యకలాపాలను యథాతథంగా కొనసాగించిందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఈ మొత్తం పరిణామం పట్ల భారత విదేశాంగ శాఖ తీవ్రంగా స్పందించింది. పాకిస్తాన్ హైకమిషన్ చార్జ్ డి అఫైర్స్(సీడీఏ) సాద్ వరైచ్‌కు సమన్లు జారీ చేసింది. బుధవారం ఆయనను పిలిపించింది. అరేబియా సముద్రంలో భారత యుద్ధనౌకను పాక్ నౌక ఢీకొట్టడంపై తీవ్ర నిరసన వ్యక్తంచేసింది. పాకిస్తాన్‌ది ఆమోదయోగ్యం కాని, వృత్తిపరమైన ప్రమాణాలకు విరుద్ధమైన ప్రవర్తన అంటూ తేల్చిచెప్పారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూసేందుకు అన్ని సైనిక విభాగాలు తగిన జాగ్రత్తలు పాటించాలని, ఇరుపక్షాల మధ్య కుదిరిన ఒప్పందాలు, నిబంధనలను గౌరవించాలని సంబంధిత పాకిస్తాన్ అధికారులకు తెలియజేయాలంటూ సాద్ వరైచ్‌కు సూచించినట్లు భారత విదేశాంగ శాఖ ప్రకటన పేర్కొంది. ఇస్లామాబాద్‌లోని పాకిస్తాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖకు కూడా ఇదే విధమైన నిరసనను తెలియజేయాలని అక్కడి భారత చార్జ్ డి అఫైర్స్‌ను ఆదేశించినట్లు స్పష్టంచేసింది. "అంతర్జాతీయ జలాల్లో జరిగిన ఈ ఘటన వల్ల పెద్దగా నష్టం వాటిల్లనప్పటికీ.. పాకిస్తాన్ నౌకాదళ నౌక వ్యవహరించిన తీరు మాత్రం సైనిక విన్యాసాలు, కదలికలు, దళాల తరలింపులకు సంబంధించిన ముందస్తు సమాచారంపై 1991 ఏప్రిల్‌లో భారత్‌పాకిస్తాన్ మధ్య కుదిరిన ఒప్పందంలోని 10వ అధికరణానికి పూర్తిగా విరుద్ధంగా ఉంది"అని భారత విదేశాంగ శాఖ తేల్చిచెప్పింది. మరోవైపు భారత నావికాదళం కూడా ఈ వ్యవహారంపై స్పందించింది. తమ ఆందోళనను పాకిస్తాన్ సైన్యానికి తెలియజేసింది.

# సిట్టింగ్ జడ్జితో విచారణకు సిద్ధమా?

(మొదటి పేజీ తరువాయి)

జరిగిన వ్యవహారాలపై హైకోర్టు లేదా సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణకు మేం సిద్ధం. మీరు సిద్ధమా?' అంటూ సీఎం రేవంత్‌రెడ్డికి బీఆర్ఎస్ఎల్పీ ఉప నేత హరీశ్‌రావు సవాల్ విసిరారు. ప్రజా సమస్యలు, ఆరు గ్యారంటీల అమలు, రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై తాము ప్రశ్నిస్తుంటే సమాధానం చెప్పే ధైర్యం లేకే సీఎం వ్యక్తిగత ఆరోపణలకు దిగుతున్నారని విమర్శించారు. ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పలేక డైవర్షన్ డ్రామాలు చేస్తూ ప్రభుత్వ తప్పిదాలు ప్రశ్ని స్తున్న తమపై ఎదురుదాడి చేస్తున్నారని, దబాయింపులు, బెదిరింపులకు దిగుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో పాటు ఆ పార్టీ నేతలపై బుధవారం అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ఆరోపణలు ఖండిస్తూ.. తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి తదితరులతో కలిసి హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు.

'నిషేధిత భూముల అంశంలో బీఆర్ఎస్ ఇన్నాళ్లుగా చెబుతోంది సీఎం మాటలే ధ్రువీకరించాయి. 3.71 లక్షల ఎకరాలను నిషేధిత జాబితాలో పెట్టామని, సమస్యను పరిష్కరించే క్రమంలో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయి 30 లక్షల కుటుంబాలకు సమస్య ఏర్పడిందని సీఎం చెప్పడమే ఇందుకు నిదర్శనం. మేం ఇదే విషయాన్ని ఇన్నాళ్లూ చెబుతున్నాం. ఇప్పుడు సీఎం స్వయంగా రిజిస్ట్రేషన్లు ఆగిపోయాయని ఒప్పుకున్నారు. మరి ప్రజలను ఇబ్బందులకు గురిచేసిన తప్పిదానికి బాధ్యత ఎవరిది? ఆదేశాలు ఇచ్చిన అధికారులపై, జాబితాను అప్‌లోడ్ చేసిన కలెక్టర్లపై చర్యలెందుకు లేవు? ఒక్క ఎకరా కూడా నిషేధిత జాబితాలో పెట్టలేదని చెప్పిన రెవెన్యూ మంత్రిపై చర్యలెందుకు తీసుకోలేదు? 22ఏపై తప్పు జరిగిందని



ఒప్పుకున్న ప్రభుత్వం ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలి. ఎప్పటిలోగా సమస్యను పరిష్కరిస్తారో కాలపరిమితితో ప్రకటించాలి. కమిటీ వేస్తాం.. పరిశీలిస్తాం.. మార్గదర్శకాలు ఇస్తాం.. ఫీజులు కట్టించు కుంటాం.. అంటూ మాటలు చెబుతున్నారు. ప్రజలకు పరిష్కారం ఎప్పుడు ఇస్తారో చెప్పరు. ఎదురుదాడితో ప్రజల బాధ పోతుందా? సీఎంకు ఒక చట్టం.. సామాన్యుడికి మరో చట్టమా? మీ ఇల్లు నిషేధిత జాబితా నుంచి తొలగించినట్టే రాష్ట్రంలోని ప్రతి సామాన్యుడి భూమికీ ఊరట కల్పించాలి..' అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

'కేసీఆర్ ఎకరం కోసం, గజం కోసం ఆలోచించే వ్యక్తి కాదు. తెలంగాణ కోసం తన ప్రాణాలను పణంగా పెట్టిన ఉద్యమ నాయకుడు. ఆయనకు వెయ్యి ఎకరాలున్నాయని ఒకసారి.. ఇప్పుడు 60 ఎకరాలు ఉన్నాయని రేవంత్ పొంతన లేని లెక్కలు చెప్తున్నాడు. ఫామ్‌హౌస్, భూముల విషయంలో చేసిన ఆరోపణలన్నీ ఎన్నికల అఫిడవిట్లు, ఆదాయపు పన్ను రిటర్నుల్లో నేను వెల్లడించివే. నా భూములపై కలెక్టర్లు, సర్వేయర్లు, విజిలెన్స్, సీఐడీ, ఇంటెలిజెన్స్ వంటి విభాగాలతో విచారణలు జరిపించినా అక్రమాలు నిరూపించలేకపోయారు. నా భూములపై అనుమానం ఉంటే సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించు. నీ ఆస్తులు, నీ తమ్ముళ్ల ఆస్తులు, నీ కుటుంబ ఆస్తులపైనా అదే విచారణ జరుపుదాం. ఒక్క కొత్రలోనే మీ కుటుంబ సభ్యుల పేరిట 170 ఎకరాలు ఉన్నట్లు సమాచారం వచ్చింది. మీ కుటుంబ సభ్యుల పేరిట 308 ఎకరాలకు ఉన్నట్లు ప్రాథమిక వివరాలు అందాయి.

ధరణి, భూభారతిలో బీఆర్ఎస్ హయాంలోనే కాదు, ప్రస్తుత ప్రభుత్వ హయాంలో జరిగిన ప్రతి అవకతవక పైనా విచారణకు సిద్ధం. మేం చేసిన ఆరోపణలకు ఆధారాలు సభలో పెడతాం. సస్పెన్షన్ ఎత్తేస్తే అసెంబ్లీకి వచ్చి ఆధారాలతో మాట్లాడతాం. భూ భారతి చలాన్ల వ్యవహారం, ప్రజల ఆస్తులు ఇతరుల పేర్లకు మారిన లావాదేవీలు, నాదర్‌గుల్ భూముల అంశం.. ఇలా మేం లేవనెత్తిన ప్రతి ప్రశ్నకు ప్రభుత్వం సమాధానం చెప్పాలి..' అని హరీశ్‌రావు అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో పచ్చి అబద్ధాలు మాట్లాడి బీఆర్ఎస్ నేతలపై బురదజల్లే ప్రయత్నం చేశారని జగదీశ్‌రెడ్డి విమర్శించారు. తమ వద్ద ఒక్క ఇంచు భూమి అక్రమంగా ఉన్నా నిరూపించాలని సవాల్ చేశారు. కేసీఆర్, కేటీఆర్, బీఆర్ఎస్ నేతలపై సీఎం చేసిన ఆరోపణలు సభ గౌరవాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు.



## నగర సమస్యలకు సమగ్ర, దీర్ఘకాలిక పరిష్కారాలు అవసరం: కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి)

ప్రస్తావించారు. ప్రతి జిల్లా కేంద్రంలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయడంతో పాటు అనేక టైర్-2 నగరాల్లో ఐటీ టవర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలను హైదరాబాద్‌కు వెలుపల కూడా అభివృద్ధి చేయడం ద్వారా నగరంపై ఒత్తిడిని తగ్గించే ప్రయత్నం చేసినట్లు వివరించారు. పట్టణ రవాణా, ప్రజా రవాణా వ్యవస్థలపై మాట్లాడుతూ హైస్పీడ్ రైలు నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేయడం ద్వారా పెద్ద నగరాలపై రవాణా, జనాభా ఒత్తిడిని తగ్గించవచ్చని కేటీఆర్ అన్నారు. వచ్చే దశాబ్దంలో ఈ దిశగా మరింత పురోగతి సాధిస్తామనే నమ్మకం ఉందని పేర్కొన్నారు. నగర ప్రభుత్వాలకు మూలధనం అందుబాటులోకి తీసుకురావడం పెద్ద సవాలుగా ఉందని కేటీఆర్ అన్నారు. నగరాలు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపేందుకు వినూత్నమైన, అందరినీ భాగస్వామ్యం చేసే విధానాలను అనుసరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అనంతరం కేటీఆర్ కార్యక్రమం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన 'భారత్ ఏఐ ఎక్స్‌పీరియెన్షియల్ సెంటర్'ను సందర్శించారు. ప్రజా ప్రయోజనాల కోసం కృత్రిమ మేధస్సు ఆధారిత పరిష్కారాలపై పనిచేస్తున్న వివిధ సంస్థల ప్రతినిధులతో ఆయన మాట్లాడారు. భారతదేశంలోని నగరాలు, పట్టణాల్లో ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే లక్ష్యంతో జనాగ్రహ సంస్థ పనిచేస్తోంది. పట్టణ పాలన రంగంలో ప్రభుత్వాలు, రాజ్యాంగ సంస్థలు, పౌర సమాజ సంస్థలతో భాగస్వామ్యంగా వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తోంది.

## నెట్ జీరో సిటీగా ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి ప్రణాళికలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రతినిధులు సీఎంకు వివరించారు. అనంతరం సీఎం వారికి మూసీ పునరుజ్జీవం, ఫ్యూచర్ సిటీ అభివృద్ధి వంటి అంశాలను వివరించారు. "తొలిదశలో మూసీ, ఈసీ నదుల సంగమమైన గాంధీ సరోవర్ వరకు మూసీ పునరుజ్జీవం చేపట్టనున్నాం. రివర్ ఫ్రంట్ అభివృద్ధితోపాటు నైట్ ఎకానమీ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేశాం. హైదరాబాద్‌ను పర్యాటకంగానే కాకుండా నాలెడ్జ్ హబ్‌గానూ తీర్చిదిద్దుతున్నాం. ఇప్పటికే హార్వర్డ్, ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలు, ఎంఐటీ, లండన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ తమ ఆఫ్ షోర్ క్యాంపస్‌లను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసేందుకు అంగీకరించింది. రాష్ట్రంలో మీ పెట్టుబడులకు మా ప్రభుత్వం అన్ని రకాలుగా సహకరిస్తుంది. ఫ్యూచర్ సిటీలో డిసెంబరులో నిర్వహించనున్న తెలంగాణ గ్లోబల్ సమిట్‌కు హాజరు కావాలి' అని సీఎం వారిని ఆహ్వానించారు. రాష్ట్రంలో పెట్టుబడుల పెట్టడానికి సింగపూర్ ప్రతినిధులు సానుకూలంగా స్పందించారు. ప్రభుత్వ సలహాదారు రామకృష్ణారావు, దక్షిణాసియా సీనియర్ డైరెక్టర్ ఫ్రాన్సిస్ చోంగ్, కాన్సుల్ జనరల్ విలియం చిక్, ఇతర సింగపూర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులను ప్రోత్సహించండి

(మొదటి పేజీ తరువాయి)

ద్వారా తెలంగాణను గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. హై వాల్యూ ఇండస్ట్రీస్, ఆర్అండ్‌డీ టెక్నాలజీ ఆధారిత పరిశ్రమలకు అవసరమైన ఎకో సిస్టమ్‌ను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నాం. ఐటీ, ఐటీఈఎస్, ఎమర్జింగ్ టెక్నాలజీస్, సెమీకండక్టర్లు, ఎలక్ట్రానిక్స్, అడ్వాన్స్‌డ్ మాన్యుఫ్యాక్చరింగ్, లైఫ్‌సైన్సెస్, బయో టెక్నాలజీ, ఏరోస్పేస్, గ్రీన్ టెక్నాలజీ, రెన్యూవబుల్ ఎనర్జీ, లాజిస్టిక్స్ అండ్ సప్లయి చైన్, అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఆర్అండ్‌డీ, స్కిల్ డెవలప్‌మెంట్, ఇన్నోవేషన్ తదితర రంగాల్లో పెట్టుబడులు పెట్టడానికి రాష్ట్రంలో విస్తృత అవకాశాలున్నాయి. ఈ ఏడాది డిసెంబరు 6, 7, 8 తేదీల్లో నిర్వహించనున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్-2026లో ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొనేలా సింగపూర్ ప్రభుత్వం సహకరించాలి" అని శ్రీధర్‌బాబు కోరారు. ఈ కార్యక్రమంలో టీజీఐఐసీ ఎండీ శశాంక, సింగపూర్ వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వశాఖ సీనియర్ డైరెక్టర్ డా.ఫ్రాన్సిస్ చోంగ్, ఇండియా డైరెక్టరేట్ డైరెక్టర్ జీన్ యీ, సౌత్ ఏషియా ఎంటర్‌ప్రైజ్ డైరెక్టర్ ఆడ్రీ టూన్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన సాంకేతికతల్లో భారత్ అగ్రస్థానానికి చేరాలి

(మొదటి పేజీ తరువాయి)



ఇప్పుడు ప్రాథమిక ప్రయత్నాల దశ నుంచి విస్తృత స్థాయి, గొప్ప అవకాశాలు కలిగిన దశకు మారుతోందని అన్నారు. సాంకేతిక పురోగతులు, పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా మన విధానాలు అభివృద్ధి చెందాలని అభిప్రాయపడ్డారు. విధానపరమైన, పరిపాలనాపరమైన చర్యలపై సూచనలు ఇవ్వాలని పరిశ్రమ వర్గాలను మోదీ ఆహ్వానించారు. సెమీకండక్టర్ రంగాన్ని మరింత బలోపేతం చేయడంలో సలహాలను పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు. భారతదేశ సెమీక ండక్టర్ రంగం వృద్ధికి చొరవ తీసుకోవాలని పారిశ్రా మికవేత్తలకు పిలుపునిచ్చారు. నైపుణ్యా భివృద్ధి, ఆవిష్కరణలు, కృత్రిమ మేధ(ఏఐ), క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి వర్ధమాన సాంకేతికతల్లో పరిశ్రమల భాగస్వామ్యం మరింత పెరగాలని మోదీ పిలుపునిచ్చినట్లు ప్రధానమంత్రి కార్యాలయం(పీఎంఓ) ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ రౌండ్‌టేబుల్ సమావేశానికి సెమీ, మైక్రాన్, ఇన్ఫినియోన్, అప్లైడ్ మెటీరియల్స్, ఏఎస్ఎంఎల్, మెర్సెక్, టోక్యో ఎలక్ట్రాన్ లిమిటెడ్, ఫుజిఫిలిం, ఇంటెల్, టాటా ఎలక్ట్రానిక్స్, సెలెస్టా క్యాపిటల్, ఫాక్స్‌కాన్, ఐబీఎం రీసెర్చ్ తదితర కంపెనీల సీఈఓలు, ప్రతినిధులు పాల్గొన్నారు. "సెమీకండక్టర్ పరిశ్రమకు కేంద్ర ప్రభుత్వం నుంచి సంపూర్ణ మద్దతు ఉంటుంది. దేశంలో పెట్టుబడులకు, వ్యాపార వృద్ధికి అనుకూల వాతావరణం ఉంది. నైపుణ్యాభివృద్ధి, ఆవిష్కరణలు, మౌలిక సదుపాయాల ఉన్నతీకరణకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది. అభివృద్ధి చెందుతున్న సాంకేతికతల్లో భారత్‌ను అగ్రగామిగా నిలిపేందుకు మనమంతా నిరంతరం కృషి చేయాలి"అని ప్రధాని మోదీ 'ఎక్స్'లో పోస్టుచేశారు.



## పార్టీ అభివృద్ధే లక్ష్యం... జనరల్ సెక్రటరీగా సుభాష్ నాయక్ బాధ్యతలు స్వీకారం

- మేడిపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా సుభాష్ నాయక్.
- సుభాష్ నాయక్ కు నియామక పత్రం అందించిన తోటకూర వజ్రేష్ యాదవ్.
- పార్టీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తా.
- పార్టీ అధిష్టానానికి, నాయకులకు నా ప్రత్యేక కృతజ్ఞతలు.

**మేడిపల్లి, సెప్టెంబర్ 16. ( ప్రజాతీర్పు )**

మేడ్చల్ మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని మేడిపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీగా సుభాష్ నాయక్ నియమించబడ్డారు. ఈ మేరకు మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ సుభాష్ నాయక్ కు నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సుభాష్ నాయక్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను శక్తివంతం లేకుండా నిర్వర్తిస్తానని తెలుపుతూ పార్టీ అధిష్టానానికి, మేడ్చల్ జిల్లా బి బ్లాక్ అధ్యక్షుడు వేముల మహేష్ గౌడ్, పీర్జాదిగూడ మాజీ మేయర్ అమర్ సింగ్, మాజీ డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్, మేడిపల్లి డివిజన్ అధ్యక్షుడు తుంగతుర్తి రవి,పార్టీ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి, ప్రజా ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తానని సుభాష్ నాయక్ అన్నారు.



## పసి బిడ్డకు తల్లి పాలే శ్రేయస్కరం

- గుల్లకోట సర్పంచ్ మల్లేష్ గౌడ్
- అంగన్ వాడి కేంద్రంలో పోషణ మాసం,అన్నప్రాసన

**( ఎలుక భగవాన్ యాదవ్, ప్రజాతీర్పు, ఎండపల్లి)సెప్టెంబర్ 16:**

పసి బిడ్డలకు తల్లిపాలే అత్యంత శ్రేయస్కరమని, తల్లి ముర్రుపాలలో అధిక విటమిన్ లు, పోషకాలు ఉంటాయని జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం గుల్లకోట గ్రామ సర్పంచ్ గొల్లపెల్లి మల్లేశం గౌడ్ పేర్కొన్నారు. బుధవారం గ్రామ పంచాయతీ ఆవరణలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పోషణ మాసం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో సర్పంచ్ మల్లేశ్ గౌడ్ మాట్లాడుతూ బాలింతలు అంగన్ వాడి కేంద్రాలలో ప్రభుత్వం అందించే బాలామృతంను పిల్లలకు తినిపించాలని, సెరిలాక్ కంటే బాలమృతంలో ఎక్కువ పోషకాలు ఉన్నాయని దానివల్ల పిల్లల మెదడు ఎదుగుదలకు చాలా తోడ్పడుతుందని, పుట్టిన బిడ్డకు గంటలోపే తల్లి ముర్రుపాలు తాగించాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం బాలామృతం మరియు పాలు, పప్పు దినుసులు, ఆకుకూరలు అన్ని పోషకాలు ఉండేలా ప్రతి రోజు అంగన్ వాడి కేంద్రాల్లో అందజేస్తున్నారని, గర్భవతి నుంచి ప్రసవానంతరం చిన్నపిల్లలకు కూడా పోషక ఆహారాలు అందజేసే అంగన్ వాడి కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ఆరు మాసాలు నిండిన పాపకి అన్నప్రాసన చేశారు. ఈ కార్యక్రమం లో ఐసీడిఎస్ సూపర్ వైజర్ ఆండాలు , గ్రామ పంచాయతీ కార్యదర్శి కొమురయ్య,అంగన్ వాడి టీచర్ లు భూలక్ష్మి, పుష్పలత, గంగ జమున, సువర్ణ ,ఆశా వర్కర్లు, బాలింతలు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## వినాయక నిమజ్జనానికి పక్కాగా ఏర్పాట్లు చేయాలి

### జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

**(బుగ్గ కృష్ణమూర్తి శర్మ, ప్రజా తీర్పు, సిరిసిల్ల) సెప్టెంబర్ 16**

వినాయక నిమజ్జనానికి ఏర్పాట్లు పక్కాగా చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. వినాయక విగ్రహాల నిమజ్జనానికి సిరిసిల్లలోని మానేరు తీరంలోని ప్రేమ్ నగర్, బ్రిడ్జి వద్ద చేస్తున్న ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితె పలు శాఖల అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. వినాయక మండపాల నిర్వాహకులు తమ విగ్రహాలను భక్తి శ్రద్ధల మధ్య వేడుకలు నిర్వహిస్తూ వైభవంగా తరలించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ అధికారులకు సహకరించాలని కోరారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందుకు వెళ్ళి, వేడుకలను విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. వినాయక నిమజ్జనానికి కావలసిన నీటి సౌకర్యం, స్టేజ్, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని, వైద్య సేవలు, అగ్ని మాపక శాఖ అధికారులు సేవలు అందించాలని, పారిశుధ్య పనులు చేయించాలని, క్రేన్లు అందుబాటులో పెట్టాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఇక్కడ మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ, ఆర్డీఓ శ్రీధర్ బాబు, డీఎస్పీ నాగేంద్రాచారి, ఎస్ బి డి ఎస్ పి. వెంకటేశ్వర్లు,నీటి పారుదల శాఖ అధికారి దయాకర్, జిల్లా వైద్యాధికారి ఏంజెలా ఆల్ఫ్రెడ్, జిల్లా మత్స్య శాఖ అధికారి సౌజన్య, తహసీల్దార్ మహేష్, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ రహిత సమాజానికి కృషి చేయండి

**( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) సెప్టెంబర్ 16.**



జగిత్యాల మున్సిపాలిటీ, జగిత్యాల జిల్లా, తెలంగాణ.

విషయం: రాబోయే గణేశ నవరాత్రి మరియు దసరా ఉత్సవాల సందర్భంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించి, ప్రజారోగ్యం మరియు పర్యావరణ పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరుతూ... జగిత్యాల కమిషనర్, మున్సిపల్ చైర్పర్సన కు వినతి పత్రం అందజేసిన జగిత్యాల ప్రముఖ న్యాయవాది నాగిరెడ్డి మధు సూధన్ రెడ్డి. జగిత్యాల జిల్లాలో రాబోయే గణేశ నవరాత్రి ఉత్సవాలు, దసరా ఉత్సవాలు పెద్ద ఎత్తున ప్రజల భాగస్వామ్యంతో జరగనున్నాయి. ఈ ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఆహారం, తాగునీరు మరియు ప్రసాదాల పంపిణీలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ గ్లాసులు, ప్లేట్లు, కప్పులు, స్పూన్లు, వాటర్ బాటిల్స్, కవర్లు తదితర ప్లాస్టిక్ వస్తువుల వినియోగం అధికమయ్యే అవకాశం ఉంది. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల అధిక వినియోగం వల్ల పెద్ద మొత్తంలో ప్లాస్టిక్ వ్యర్థాలు ఏర్పడి పర్యావరణ కాలుష్యానికి దారితీస్తాయి. ప్లాస్టిక్ వ్యర్థాలు విచ్ఛిన్నమవుతూ మైక్రోప్లాస్టిక్‌గా మారే అవకాశం ఉంది. అలాగే కొన్ని ప్లాస్టిక్ పదార్థాల్లో ఉండే రసాయనాలకు దీర్ఘకాలికంగా గురికావడం వల్ల ప్రజారోగ్యంపై ప్రతికూల ప్రభావాలు పడే అవకాశం ఉంది. ముఖ్యంగా కొన్ని రసాయనాలు క్యాన్సర్ ప్రమాదంతో సంబంధం కలిగి ఉండవచ్చనే పరిశోధనలు ఉన్నందున, ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం అవసరం.

అందువల్ల రాబోయే గణేశ నవరాత్రి మరియు దసరా ఉత్సవాలను "ప్లాస్టిక్ రహిత ఉత్సవాలు"గా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని వినమ్రంగా కోరుతున్నాను.

ఈ సందర్భంగా క్రింది చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాను:

- సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నియంత్రణ: గణేశ మండపాలు, దసరా ఉత్సవ ప్రాంగణాలు మరియు సంబంధిత కార్యక్రమాల వద్ద సింగిల్ యూజ్ ప్లాస్టిక్ గ్లాసులు, ప్లేట్లు, కప్పులు, స్పూన్లు, కవర్ల వినియోగాన్ని పూర్తిగా నియంత్రించాలి.
- పర్యావరణహిత ప్రత్యామ్నాయాలు: ప్లాస్టిక్ స్థానంలో స్టీల్, పేపర్, ఆకులు లేదా ఇతర పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను ఉపయోగించేలా నిర్వాహకులకు సూచనలు ఇవ్వాలి.
- మార్గదర్శకాల జారీ: అన్ని గణేశ మండపాలు మరియు ఉత్సవ నిర్వాహకులకు ముందుగానే ప్లాస్టిక్ వినియోగం తగ్గించే మార్గదర్శకాలు జారీ చేయాలి.
- వ్యర్థాల నిర్వహణ: మున్సిపాలిటీ, గ్రామపంచాయతీలు మరియు సంబంధిత శాఖల ద్వారా ప్రత్యేక పారిశుధ్య మరియు వ్యర్థాల నిర్వహణ చర్యలు చేపట్టాలి.
- అవగాహన కార్యక్రమాలు: ప్లాస్టిక్ కాలుష్యం వల్ల కలిగే పర్యావరణ మరియు ప్రజారోగ్య సమస్యలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి.
- అవగాహన బోర్డులు: ప్రధాన కూడళ్లలో, ఉత్సవ ప్రాంగణాల్లో వద్దు – పర్యావరణాన్ని, ప్రజారోగ్యాన్ని కాపాడుదాం" వంటి అవగాహన బోర్డులు ఏర్పాటు చేయాలి.
- పర్యవేక్షణ వ్యవస్థ: నిబంధనలకు విరుద్ధంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం జరిగితే సంబంధిత అధికారుల ద్వారా చట్టపరమైన చర్యలు తీసుకునేలా పర్యవేక్షణ వ్యవస్థ ఏర్పాటు చేయాలి.
- ప్రత్యేక శానిటేషన్ బృందాలు: గణేశ నిమజ్జనం మరియు దసరా కార్యక్రమాల అనంతరం ఏర్పడే ప్లాస్టిక్ వ్యర్థాలను వెంటనే తొలగించేలా ప్రత్యేక శానిటేషన్ బృందాలను ఏర్పాటు చేయాలి.
- ప్రచార నినాదం: "నా ఉత్సవం నా బాధ్యత, ప్లాస్టిక్ రహిత జగిత్యాల" అనే నినాదంతో ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలి.
- గ్రామీణ స్థాయిలో అమలు: ఈ కార్యక్రమాన్ని జగిత్యాల జిల్లాలోని మండలాలు, గ్రామాల స్థాయిలో కూడా అమలు చేయడానికి సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు ఇవ్వాలి. పండుగల సమయంలో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం ద్వారా పర్యావరణ కాలుష్యాన్ని నియంత్రించడంతో పాటు ప్రజారోగ్యాన్ని కాపాడేందుకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవచ్చు. భవిష్యత్ తరాలకు పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన జగిత్యాల జిల్లాను అందించేందుకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

అందువల్ల పై అంశాలను దయచేసి పరిశీలించి, రాబోయే గణేశ నవరాత్రి మరియు దసరా ఉత్సవాల సందర్భంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించేందుకు తగిన ఆదేశాలు జారీ చేసి, ప్రత్యేక చర్యలు చేపట్టవలసిందిగా పేర్కొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు గా సుంచు శేఖర్...

### డోర్నకల్ ఎమ్మెల్యే ఆశీస్సులతో అందిన అవకాశం...

**కురవి సెప్టెంబర్ 16(ప్రజా తీర్పు విలేఖరి)**



నాపై విశ్వాసం ఉంచిన కురవి మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులుగా నియమించిన బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డోర్నకల్ ఎమ్మెల్యే,ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రు నాయక్ కి సమన్వయ కమిటీ అధ్యక్షులు,కురవి మాజీ జడ్పిటిసి నా రాజకీయ గురువు అంబటి వీరభద్రం కి నాకు సోదర సమానులు మండల అధ్యక్షుడు బాలగాని శ్రీనివాస్ గౌడ్ కి,జిల్లా ఉపాధ్యక్షులు బండి శ్రీనివాస్ కి, కురవి ఆలయ చైర్మన్ కొర్ని రవీందర్ రెడ్డి కి, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు నూకల నరేష్ రెడ్డి కి,కురవి ఆలయ మాజీ చైర్మన్ రాము నాయక్ కి,మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్ నాయక్ కి,జిల్లా కోశాధికారి గార్లపాటి వెంకట్ రెడ్డికి,ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యులు గొల్లపల్లి రజనీకాంత్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## గోశాలకు సామాజిక వేత్త పశుగ్రాస విరాళం...

**(గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) సెప్టెంబర్ 16.**



ధర్మపురి పట్టణంలోని శ్రీ కాళీమాత ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న గోశాలలోని గోవుల సంరక్షణకు జగిత్యాలకు చెందిన సామాజిక సేవకుడు రాజేశుని శ్రీనివాస్, విశ్రాంత ఏ ఎస్ ఐ ఆధ్వర్యంలో రూ.27,500 నగదు విరాళాన్ని మాజీ ధర్మపురి దేవస్థానం చైర్మన్ జక్కు రవీందర్ చేతుల మీదుగా గోశాల సహాయకుడు శ్రీకాంత్‌కు అందజేశారు. వాసవి సేవాదళ్-- జగిత్యాల తదితర గ్రూపుల్లో గోశాలకు పశుగ్రాసం అవసరమని చేసిన విజ్ఞప్తికి స్పందించి దాతలు ఈ సహాయాన్ని అందించారు. త్వరలో దాతల సహకారంతో గోశాలకు అవసరమైన గరుకు స్థంభాలను కూడా ఏర్పాటు చేస్తామని శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా జక్కు రవీందర్ మాట్లాడుతూ, గోవుల సంరక్షణకు నిరంతరం పశుగ్రాసం అవసరమని, దాతలు ముందుకు వచ్చి గోసేవలో భాగస్వాములు కావాలని కోరారు. గోసేవకు విశేష పుణ్యఫలం లభిస్తుందని తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో జక్కు దేవేందర్, కోశాధికారి ఆర్యవైశ్య నిత్యాన్న సత్రం ధర్మపురి గారు పాల్గొన్నారు



## హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఫండర్ విజిట్ - సంపూర్ణ

- గ్రామీణ అభివృద్ధి కార్యక్రమాల పరిశీలన మరియు ప్రారంభోత్సవం

**గంగారం, మహబూబాద్, సెప్టెంబర్16, ప్రజా తీర్పు జిల్లా స్టాపర్:**

మహబూబాబాద్ జిల్లా గంగారం మండల పరిధిలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఆర్థిక సహకారంతో, ఎస్.ఎం. సెహగల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న సంపూర్ణ గ్రామీణ అభివృద్ధి కార్యక్రమం లో భాగంగా వివిధ అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించి, కొన్ని మౌలిక వసతులను ప్రారంభించడం జరిగింది. ఈకార్యక్రమంలోహెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ జూ= మేనేజర్ శ్రీమతి ఆసియా మేడం పాల్గొని, ప్రాజెక్టు ద్వారా చేపడుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలోపరిశీలించారు. ముందుగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి, ప్రాజెక్టు ద్వారా ఏర్పాటు చేసిన వసతులు మరియు సౌకర్యాలను పరిశీలించారు. ఆయా వసతులు ప్రజలకు ఎంతవరకు ఉపయోగపడుతున్నాయనే విషయాలను వైద్యులు మరియు స్టాఫ్ నర్సులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలను సందర్శించి,ఉపాధ్యాయులతో సమావేశమై విద్యార్థుల విద్యాభివృద్ధికి ఏర్పాటు చేసిన స్మార్ట్ క్లాస్, లేబొరేటరీ, లైబ్రరీ పుస్తకాలు తదితర సౌకర్యాలను పరిశీలించారు. ఈ సౌకర్యాలను విద్యార్థులు ఏ విధంగావినియోగిస్తున్నారనే విషయాలను విద్యార్థులతో నేరుగామాట్లాడితెలుసుకున్నారు. అదే విధంగా గంగారం సురక్షిత త్రాగునీటి శుద్ధి కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కమ్యూనిటీ సభ్యులతో మాట్లాడి, వారి సామాజిక మరియు ఆర్థిక పరిస్థితులనుతెలుసుకున్నారు. త్రాగునీటి కేంద్రం ద్వారా వచ్చే ఆదాయాన్ని పెంచుకునే అవకాశాలు, కేంద్రాన్ని సమర్థవంతంగా నిర్వహించుకోవాల్సిన విధానాలపై వారికి అవగాహన కల్పించారు. అలాగే ఈ సంవత్సరం చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా తిరుమలగండి, కామారం మరియు మర్రిగూడెం పాఠశాలల్లో చేపడుతున్న మరమ్మతు మరియు అభివృద్ధి పనులను పరిశీలించి, పనుల పురోగతిని సమీక్షించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కమ్యూనిటీ సభ్యులు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ అందిస్తున్న ఆర్థిక సహకారానికి మరియు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి అందిస్తున్న మద్దతుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఎం. సెహగల్ ఫౌండేషన్ ప్రోగ్రాం లీడ్ శ్రీ శివశరణప్ప, ప్రోగ్రాం అసోసియేట్ శ్రీధనుంజయతో పాటు ఎస్.ఎం. సెహగల్ ఫౌండేషన్ సిబ్బంది, కమ్యూనిటీ సభ్యులు, సంబంధిత పాఠశాలల ఉపాధ్యాయులు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు బహిరంగ సభను విజయవంతం చేయాలి

**(అరికిల్ల జయకుమార్, ప్రజా తీర్పు,మంచిర్యాల) సెప్టెంబర్16**



హాజీపూర్ మండల కేంద్రంలో ప్రచార జాత నిర్వహించడం జరిగింది. సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, జిల్లా కార్యవర్గ సభ్యులు రేగుంట చంద్రశేఖర్ మంచిర్యాల తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు సందర్భంగా సెప్టెంబర్ 17న హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న బహిరంగ సభను ప్రజలు, కార్మికులు, రైతులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సీపీఐ మంచిర్యాల జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్,జిల్లా కార్యవర్గ సభ్యులు రేగుంట చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం భూస్వామ్య, నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన మహత్తర ప్రజా పోరాటమని వారు పేర్కొన్నారు. ఈ పోరాటంలో కమ్యూనిస్టులు, రైతులు, కూలీలు, మహిళలు, సామాన్య ప్రజలు కీలక పాత్ర పోషించారని తెలిపారు. వేలాది మంది ప్రజలు త్యాగాలు చేసి తెలంగాణ సమాజంలో మార్పుకు పునాదులు వేశారని అన్నారు. నేటి తరానికి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను వాస్తవ రూపంలో తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. చరిత్రను వక్రీకరించే ప్రయత్నాలను ప్రజలు ప్రశ్నించాలని, పోరాట చరిత్రను భావితరాలకు అందించే విధంగా పాఠ్యాంశాల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 17న నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో జరిగే ముగింపు బహిరంగ సభకు మంచిర్యాల జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చి సభను విజయవంతం చేయాలని రామడుగు లక్ష్మణ్, రేగుంట చంద్రశేఖర్, మేకలదాస్,జిల్లా కార్యవర్గ సభ్యులు, దేవి పోచన్న,హాజీపూర్ మండల కార్యదర్శి,వనంర సత్యనారాయణ జిల్లా సమితి సభ్యులు, ప్రజానాట్యమండలి కళాకారులు రొంటాల శ్యామ్, జూల మోహన్, జాలిగాపురాజు, జనగామ బానేస్, రంజిత్ కుమార్ పాల్గొన్నారు.

# బెల్లంపల్లి ఏరియాలో ఏఐటీయూసీ జోరు

- గేట్ మీటింగ్‌లతో కార్మికుల్లో కదలిక.. పలువురు కార్మికులు యూనియన్‌లో చేరిక

**(రాంపెల్లి చంద్రశేఖర్, ప్రజాతీర్పు--తాండూర్ మండలం రిపోర్టర్) సెప్టెంబర్ 16**



గోలేటి: బెల్లంపల్లి ఏరియా పరిధిలోని ఖైరగూడ ఓపెన్‌కాస్ట్, రెబ్బన సీహెచ్‌పీ, గోలేటి జీఎం కార్యాలయం వద్ద ఏఐటీయూసీ గోలేటి బ్రాంచ్ కార్యదర్శి ఎస్. తిరుపతి ఆధ్వర్యంలో గేట్ మీటింగ్‌లు నిర్వహించారు. సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ప్రధాన అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ వీరభద్రయ్య పాల్గొని కార్మికుల సమస్యలు, యూనియన్ సాధించిన ఒప్పందాలను వివరించారు. ఈ సందర్భంగా వాసిరెడ్డి సీతారామయ్య మాట్లాడుతూ.. కార్మిక సమస్యల పరిష్కారం కోసం ఏఐటీయూసీ నిరంతరం పోరాటాలు చేస్తోందన్నారు. పరిష్కారం కాని 31 డిమాండ్లపై జూన్ 8న సమ్మె నోటీసు ఇవ్వడంతో యాజమాన్యం చర్చలకు ముందుకు వచ్చిందన్నారు. ఆర్ఎల్‌సీ సమక్షంలో జరిగిన చర్చల్లో కార్మికులకు అనుకూలంగా పలు అంశాలపై ఒప్పందం కుదిరిందని తెలిపారు. ఒప్పందంలోని ముఖ్య అంశాలు: కార్మికుల పెర్క్స్‌పై పడే ఆదాయపు పన్నును కంపెనీ చెల్లించేలా చర్యలు, సహజ మరణం పొందిన కార్మికుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా రూ.20 లక్షలకు పెంపు, సొంత ఇంటి పథకంపై పరిశీలన, దసరా పండుగకు ముందే లాభాల వాటా చెల్లింపు, పెండింగ్ డిపెండెంట్ల సమస్యల పరిష్కారం, మెడికల్ అన్‌ఫిట్ సిబ్బందికి ప్రత్యామ్నాయ ఉద్యోగాల కల్పన, పెండింగ్ ప్రమోషన్లు--పరీక్షలను త్వరితగతిన పూర్తి చేయడం, హైదరాబాద్‌లో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటు, రిటైర్డ్ కార్మికులకు ఉచిత ఇన్‌పేషెంట్ వైద్యసేవలు, అర్హులైన కార్మికులకు హెచ్‌ఆర్‌ఏ, బదిలీలకు అవకాశం తదితర అంశాలపై ఒప్పందం కుదిరిందన్నారు.

**ఏఐటీయూసీలో పలువురి చేరిక**

ఖైరగూడలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఏఐటీయూసీ చేపడుతున్న కార్మిక పోరాటాలకు ఆకర్షితులైన పలువురు కార్మికులు యూనియన్‌లో చేరారు. సీనియర్ ఈపీ టీ. రామకృష్ణ, కొండిల్ల శ్రీనివాస్, ప్రశాంత్, టీ. సంపత్, పి. తిరుపతి, ఎల్. రాములు, వై. తిరుమల్, భీమిని తిరుపతి, ఎం.డి. రహీమ్, డి. స్వామి, దాసరి కుమార్, గూడూరు శ్రీనివాస్, విజయ్ కుమార్, తుమ్మల సంపత్, బి. రవీందర్ తదితరులకు నాయకులు ఎర్రజెండా కప్పి యూనియన్‌లోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమాల్లో ఫిట్ కార్యదర్శులు మారం శ్రీనివాస్, ఎంబడి రామయ్య, కోడం అశోక్, జీఎం కమిటీ సభ్యులు జూపాక రాజేష్, బి. జగ్గయ్య, ఆనంద్, ఆర్గనైజింగ్ కార్యదర్శులు కె. కిరణ్‌బాబు, ఎం.ఎ. సమీ అద్నాన్ అఫ్రీది, సహాయ కార్యదర్శులు మాల ఓదేలు, అబ్దుల్ వసీం, పుట్ట అంజయ్య, మహిళా నాయకురాళ్లు మాయ, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



## సమాచార హక్కుతో ప్రజలకు అండగా.. తాండూర్‌లో ఆర్టీఐ కొత్త కమిటీ

- నూతన సభ్యులకు ఐడీ కార్డులు, నియామక పత్రాల అందజేత
- ప్రజల్లో సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించడమే లక్ష్యం

**(రాంపెల్లి చంద్రశేఖర్, ప్రజాతీర్పు -- తాండూర్ మండలం రిపోర్టర్) సెప్టెంబర్ 16**

ఆర్టీఐ జాతీయ చైర్మన్ చంటి ముద్దురాజ్ ఆదేశాల మేరకు, తెలంగాణ రాష్ట్ర కో-కన్వీనర్ గడప కృష్ణ ఆధ్వర్యంలో తాండూర్‌లో ఆర్టీఐ గ్రూప్ నూతన కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన సభ్యులకు ఐడీ కార్డులు, నియామక పత్రాలను అందజేశారు. సమాచార హక్కు చట్టం ద్వారా ప్రజలకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ సమాచారాన్ని పొందేలా అవగాహన కల్పించడంతో పాటు, ప్రజా సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయడమే ఆర్టీఐ గ్రూప్ ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. ప్రజల హక్కులు, ప్రభుత్వ పథకాలు, అధికారుల బాధ్యతలపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు నూతన కమిటీ సభ్యులు కృషి చేయాలని సూచించారు. నూతన బాధ్యతలు చేపట్టిన సభ్యులు మాట్లాడుతూ.. తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజల సమస్యలకు అండగా నిలుస్తామని తెలిపారు. సమాచార హక్కు చట్టంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నస్పూర్ జనరల్ సెక్రటరీ తునికి శ్రీనివాస్ రాజు, మంచిర్యాల జనరల్ సెక్రటరీ పురేళ్ల శ్రీనివాస్, మందమర్రి మండల అధ్యక్షుడు అలిశెట్టి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు. నూతన కమిటీలో పార్వతి అజయ్ -- మంచిర్యాల జిల్లా కో-ఆర్డినేటర్, రాంపెల్లి చంద్రశేఖర్ -- తాండూర్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్, చింతల సంతోష్ -- మండల అధ్యక్షుడు, తోగరి సతీష్ -- మండల డిప్యూటీ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు స్వీకరించారు.

## రాచర్ల కోటను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి పరచాలి

**(బుగ్గ కృష్ణమూర్తి శర్మ, ప్రజా తీర్పు, ఎల్లారెడ్డిపేట) సెప్టెంబర్ 16**



కాకతీయుల కాలంలో నిర్మితమైన రాచర్ల బొప్పాపూర్ గ్రామంలోని చారిత్రక రాచర్ల కోటను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్ది ప్రజలకు అందుబాటులోకి తేవాలని కోరుతూ బిజెపి ,రాష్ట్ర నాయకులు మారవేని రంజిత్ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం పర్యటన శాఖ పూరవస్తు శాఖలా కమిషన్ లకు రిజిస్టర్ పోస్ట్ ద్వారా వినతిపత్రం పంపారు . ఈ సందర్భంగా మారావేణి రంజిత్ కుమార్ మాట్లాడుతూ రాచర్ల కోటకు ఎంతో పురాతనమైన చారిత్రక మరియు ఆధ్యాత్మిక ప్రాధాన్యత ఉంది రాచర్ల కోటను సింగమా రాజు పరిపాలించాడు అని చరిత్ర తెలుపుతుంది అన్నారు రాచర్ల కోట పరిధిలోని జక్కుల చెరువులో ఉన్న స్వయంభు విఘ్నేశ్వర స్వామి. శివాలయం ఆలయాన్ని నిర్మించి హనుమాన్ ఆలయం అభివృద్ధి చేయాలని రాచర్ల కోటను చారిత్రక పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయడానికి ప్రత్యేక ప్రతిపాదనలు సిద్ధం చేయాలి అని కోరారు. చారిత్రక కోట నిర్మాణాన్ని పరిరక్షించేందుకు పురావస్తు శాఖ అధికారులతో పరిశీలన నిర్వహించాలని, జక్కుల చెరువు కట్టపైన ఆహ్లాదకరమైన వాతావరణం పర్యటన కేంద్రముగా చేయడానికి అలాగే బోటింగ్ కు అనువైన ప్రాంతం కోట పరిసరాల్లో రోడ్డు సౌకర్యం విద్యుత్,మరియు భక్తులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలి.స్మాశాన వటిక నుండి రాచర్ల కోట వరకు సీసీ రోడ్డు వేస్తే దారి సులభం అవుతుంది పర్యాటక శాఖ ఆధ్వర్యంలో రాచర్ల కోట అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలి విజ్ఞప్తి చేశారు.ఈ ప్రాంతచారిత్రక వారసత్వాన్ని భవిష్యత్ తరాలకు అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు కార్యక్రమం లో మారావేణి రంజిత్ కుమార్ తో పాటు, లంబ కుమార్ ,కానమనేని వినయ్ పాల్గొన్నారు.



## నీట్‌లో ప్రతిభ కనబరిచిన హర్షిణీకి ఘన సన్మానం

**కోరుట్ల, సెప్టెంబర్ 16 (ప్రజాతీర్పు)**

ఇటీవల విడుదలైన నీట్ ఫలితాల్లో కోరుట్ల పట్టణంలోని 12వ వార్డు ఝాన్సీ రోడ్డుకు చెందిన గుంటుక లింగమూర్తి--మమత దంపతుల కుమార్తె గుంటుక హర్షిణీ ప్రతిభ కనబరిచారు. జాతీయ స్థాయిలో 1,67,144వ ర్యాంకు, రాష్ట్ర స్థాయిలో 3,288వ ర్యాంకు సాధించిన సందర్భంగా ఆమెను బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి మ్యాకల గణేష్ ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా మ్యాకల గణేష్ మాట్లాడుతూ హర్షిణీ భవిష్యత్తులో వైద్య రంగంలో మరిన్ని విజయాలు సాధించి, కోరుట్ల పట్టణానికి మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. హర్షిణీ 12వ వార్డుకు చెందిన విద్యార్థిని కావడం వార్డుకే గర్వకారణమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో గంగపుత్ర సొసైటీ డైరెక్టర్ పెద్దబోయిని జెలేందర్, గంగపుత్ర సంఘం నాయకులు పల్లికొండ అంజయ్య, పల్లికొండ ప్రసాద్, పల్లికొండ రవి, పాంపట్టి అరుణ్ కుమార్, పెద్దబోయిని అనిల్ కుమార్, అన్నందాసుల రాజు తదితరులు పాల్గొన్నారు.




## గొల్లపల్లిలో ఏకరూప దుస్తుల పంపిణీ

**ఎల్లారెడ్డిపేట సెప్టెంబర్ 16 (ప్రజా తీర్పు)**

రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ప్రభుత్వ పాఠశాలకు పంపిణీ చేస్తున్న ఏకరూప దుస్తులనుస్తులను ఎల్లారెడ్డిపేట మండలంలోని జెడ్.పి.హెచ్.ఎస్ రాచర్ల గొల్లపల్లి పాఠశాలలో బుధవారం పంపిణీ చేశారు . 2026-27 విద్యా సంవత్సరానికి గాను ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు అందించిన ఏకరూప దుస్తులను పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సర్పంచ్ రమేష్ గౌడ్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ శ్రీమతి జనగామ రమ, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, పాఠశాల మాజీ కమిటీ చైర్మన్ శ్రీ గోగూరి శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా విద్యార్థులకు దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ శ్రీ కొండ రమేష్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి, విద్యార్థుల సంక్షేమానికి ఎంతో కృషి చేస్తుందని, ప్రభుత్వం అందిస్తున్న ఉచిత ఏకరూప దుస్తులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, ఏకరూప దుస్తులు విద్యార్థులలో సమానత్వాన్ని ఐక్యతను పెంపొందిస్తాయని అన్నారు.క్రమశిక్షణతో మెలగాలని, చదువులో రాణించి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు సి.హెచ్. రత్నాకర్ , మాట్లాడుతూ ప్రభుత్వం అందించిన దుస్తులను ప్రతిరోజూ ధరించి పాఠశాలకు హాజరు కావాలని విద్యార్థులకు సూచించారు.. ఈ కార్యక్రమానికి సహకరించిన సర్పంచ్ కొండ రమేష్, పాలకవర్గానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## ఈపీఎఫ్ వేతన పరిమితి పెంపుపై బీఎంఎస్ హర్షం

**( వకుళాభరణం భానుప్రకాష్ ప్రజాతీర్పు బ్యూరో చీఫ్ కరీంనగర్) సెప్టెంబర్ 16**




ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) తప్పనిసరి వేతన పరిమితిని నెలకు రూ.15 వేల నుంచి 25 వేలకు పెంచుతూ కేంద్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయం పట్ల భారతీయ మజ్దూర్ సంఘ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పప్పుల సురేష్ హర్షం వ్యక్తం చేశారు. ఇది బీఎంఎస్ పోరాటాల ఫలితమేనని సురేష్ పేర్కొని బుధవారం రోజున పత్రిక ప్రకటన విడుదల చేశారు. ఈ నిర్ణయం ద్వారా దేశవ్యాప్తంగా 51 లక్షలకు పైగా అదనపు ఉద్యోగులు తప్పనిసరి ఈపీఎఫ్ఓ పరిధిలోకి వస్తారని, ఉద్యోగులకు భవిష్య నిధి , పెన్షన్ , బీమా రక్షణ మరింత విస్తృతంగా లభిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం 'వికసిత్ భారత్ 2047' లక్ష్యాన్ని సాధించే దిశలో పెరుగుతున్న వేతనాలకు అనుగుణంగా కార్మికులకు దీర్ఘకాలిక పదవీ విరమణ భద్రత కల్పించే దిశగా ఇది కీలక అడుగు పడిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పసుల శ్రవణ్, జిల్లా కార్యదర్శి తొర్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మూసాపేట్‌లో ఘనంగా వినాయక చవితి వేడుకలు

- వినాయకుడి పూజల్లో పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన బండి రమేష్

**కూకట్పల్లి, సెప్టెంబర్ 16(ప్రజాతీర్పు)**




మూసాపేట్ డివిజన్‌లో తూము రజినీకాంత్ ఆధ్వర్యంలో వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని వినాయకుడి ప్రత్యేక పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్ ముఖ్య అతిథిగా హాజరై వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తుల కోసం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని, నిర్వాహకులను అభినందించారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ, వినాయక చవితి పండుగ ప్రజలందరిలో భక్తి, ఐక్యత, సోదరభావాన్ని పెంపొందించాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరి జీవితంలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, విజయాలు కలగాలని విఘ్నేశ్వరుడిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో పుష్పారెడ్డి, తూము సంతోష్, ఎల్లారావు, సతీష్ గౌడ్, కర్రెమ్మ, ఇజాజ్, వాసు తదితరులు పాల్గొన్నారు.

## భారత యుద్ధనౌకను ఢీకొన్న పాక్ నౌక

అంతర్జాతీయ జలాల్లో భారత నౌకాదళానికి చెందిన యుద్ధ నౌకను పాకిస్థానీ నౌకాదళ నౌక ఢీకొంది. ఈ ఘటన దరిమిలా ఢిల్లీలోని అత్యున్నత దౌత్యాధికారిని భారత ప్రభుత్వం పిలిపించింది. కాగా భారత యుద్ధనౌకకు ఎలాంటి నిర్మాణపరమైన నష్టం జరగడం గానీ నౌకలోని సిబ్బంది గాయపడడం గానీ జరగలేదు. పాక్ నౌకాదళాల ఆమోదయోగ్యం కాని, వృత్తివిరుద్ధ ప్రవర్తన కారణంగానే ఈ ఘటన జరిగినట్టు భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో విమర్శించింది. అరేబియా సముద్రంలో ఇది రెండో ఘటన.ఏడెన్ గల్ఫ్ సమీపంలో సముద్రపు దొంగల నిరోధక, నిఘా మిషన్ల కోసం మోహరించిన భారత నౌకాదళ ఆస్తులకు పాక్ యుద్ధ నౌకలు అత్యంత సమీపంలో ప్రమాదకరమైన విన్యాసాలకు ప్రయత్నించినట్టు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి.



## వినాయక చవితి సందర్భంగా పద్మావతి ప్లాజాలో అన్నదానం

**కూకట్‌పల్లి,సెప్టెంబర్ 16(ప్రజాతీర్పు)**

వినాయక నవరాత్రుల సందర్భంగా కూకట్‌పల్లి పద్మావతి ప్లాజాలో 'ప్లాజా కా రాజా' పేరుతో కొలువుదీరిన గణనాథుడి సన్నిధిలో బుధవారం భక్తుల కోసం అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.పద్మావతి ప్లాజా గ్రౌండ్ ఫ్లోర్‌లో శివకృష్ణ--న్యూ వెంకటేశ్వర మొబైల్స్, రాఘవ--రవిచంద్ర మొబైల్స్, భాస్కర్--భాస్కర్ మొబైల్స్, వెంకట్‌రెడ్డి--ఏ.జె. మొబైల్స్, ప్రసాద్--ప్రసాద్ మొబైల్ ఫిక్సర్, రాజేష్--బాంబే డైయింగ్ వారి సహకారంతో అన్నసమారాధన నిర్వహించారు.ఈ కార్యక్రమానికి భక్తులు, స్థానికులు, వ్యాపారులు పెద్ద సంఖ్యలో హాజరై అన్నప్రసాదాన్ని స్వీకరించారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో నిర్వాహకులు, వ్యాపారులు పాల్గొని భక్తులకు ప్రసాద వితరణ చేశారు.వినాయకుని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో, ఆనందంగా ఉండాలని నిర్వాహకులు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా భక్తులు, స్థానిక ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు.

## అడిడాస్ ఇండియా టెక్ హబ్‌లో కోతలు 50% ఉద్యోగులపై ప్రభావం

గురుగ్రామ్‌లోని అడిడాస్ ఇండియా టెక్ హబ్‌లో పనిచేస్తున్న ఉద్యోగుల్లో 50 శాతం మందిని తొలగిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. వీరిలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, డాటా సైంటిస్టులు, డాటా ఇంజినీర్లు ఉన్నారు. భారత్‌లోని తమ టెక్నాలజీ విభాగంలో కొన్ని ఉద్యోగాలను తగ్గిస్తున్నట్లు అడిడాస్ ధ్రువీకరించింది. 'ఓక్లట్'కు ఇచ్చిన ఒక ప్రకటనలో అడిడాస్ ఈ విషయాన్ని ధ్రువీకరించింది. వ్యాపార అవసరాలలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఈ చర్య తీసుకున్నట్లు పేర్కొంది. 'అడిడాస్‌కు మా సహచరులు అందించిన అనేక సేవలకు మేము ఎంతో కృతజ్ఞులం. ఈ సమయంలో సహాయాన్ని అందించేందుకు కట్టుబడి ఉన్నాం' అని సంస్థ తెలిపింది.

# చక్రపాణి కుటుంబానికి బిఆర్ఎస్ నాయకుల చేయూత

- ప్రతి కార్యకర్త కుటుంబానికి బిఆర్ఎస్ పార్టీ అండగా ఉంటది
- వెల్గటూర్ ఏఎంసీ మాజీ చైర్మన్ పత్తిపాక వెంకటేష్

**( ఎలుక భగవాన్ యాదవ్, ప్రజాతీర్పు, ఎండపల్లి) సెప్టెంబర్16:**



ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందిన ఉమ్మడి వెల్గటూర్ మండల బిఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షుడు తంగెళ్లపల్లి చక్రపాణి కుటుంబానికి ఉమ్మడి వెల్గటూర్ మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు అండగా నిలిచి, ఆర్థికంగా సాయమందించారు. వెల్గటూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పత్తిపాక వెంకటేష్ ఆధ్వర్యంలో కార్యకర్తల నుండి పోగుచేసిన సుమారుగా రూ. 50,000 లను బుధవారం చక్రపాణి కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా పత్తిపాక వెంకటేష్ మాట్లాడుతూ తంగళ్లపల్లి చక్రపాణి అకాల మరణం అత్యంత బాధకరమని, ఆయన మృతి పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు . ప్రతి కార్యకర్త కుటుంబం లో ఒకరికి ఒకరు చేధోడు వాదోడు ఉండి, కష్ట సుఖాల్లో పాలుపంచుకోవాలనీ పిలుపునివ్వడంతో స్పందించి చక్రపాణి కుటుంబానికి సాయం చేసిన ప్రతి కార్యకర్తకు ధన్యవాదాలు తెలిపారు.



## బోడుప్పల్ రాజశేఖర్ కాలనీలో అక్రమ షెడ్‌పై అధికారుల చర్యలు

- అక్రమ షెడ్‌పై అధికారుల ఉక్కుపాదం.. సెటిలర్స్ ఫోరం అధ్యక్షులు కత్తి వెంకట్ రెడ్డి ఫిర్యాదుతో కదిలిన అధికారులు!.
- ప్రభుత్వ ఆదాయానికి గండి కొడితే సహించం.. అక్రమ షెడ్లపై కత్తి వెంకట్ రెడ్డి హెచ్చరిక!.
- అక్రమ కట్టడాలకు చెక్.. 24 గంటలూ నిఘా పెడతాం: సెటిలర్స్ ఫోరం.

**మేడిపల్లి, సెప్టెంబర్ 16. ( ప్రజాతీర్పు )**

రాజశేఖర్ కాలనీలో నిర్మిస్తున్న అక్రమ షెడ్‌పై అధికారులు చర్యలు చేపట్టారు. అక్రమ నిర్మాణంపై బోడుప్పల్ సెటిలర్స్ ఫోరం అధ్యక్షులు కత్తి వెంకట్ రెడ్డి ఫిర్యాదు చేయడంతో అధికారులు స్పందించి నిర్మాణంపై చర్యలకు ఉపక్రమించారు. ఈ సందర్భంగా కత్తి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలిగించే అక్రమ నిర్మాణాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. కాలనీల్లో జరుగుతున్న అక్రమ కట్టడాలపై నిరంతరం నిఘా ఉంచి, వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు జరిగేలా ఫోరం తరపున కృషి చేస్తామని తెలిపారు. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అక్రమ నిర్మాణాలను అడ్డుకోవడంలో అధికారులకు సహకరిస్తామని, నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తామని కత్తి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. ఎడ్ల శ్రీనివాస్ రెడ్డి,అమర్ లింగారెడ్డి, బజ్జూరి శ్రీనివాస్, వెంకట్ స్వామి, గొల్లపూడి శ్రీనివాస్ రావు, చక్రవర్తి, కృష్ణయ్య, మధుసూదన్, రాజశేఖర్ రెడ్డి, రామకృష్ణ, రాజు యాదవ్, తదితరులు పాల్గొన్నారు..

### 20వ వార్డులో రోడ్డు సమస్యకు పరిష్కారం ఎప్పుడు?

- మడిపల్లి రైల్వే గేటు నుంచి స్టేషన్ క్యాబిన్ వరకు రోడ్డు లేక ఇబ్బందులు
- సీసీ రోడ్డు నిర్మాణానికి చైర్మన్, కమిషనర్, హామీ

**జమ్మికుంట సెప్టెంబర్ 16 ప్రజాతీర్పు**




జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డులో రోడ్డు సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వార్డు ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. మడిపల్లి రైల్వే గేటు నుంచి రైల్వే స్టేషన్ క్యాబిన్ వరకు సరైన రహదారి లేకపోవడంతో నిత్యం రాకపోకలు సాగించే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ సమస్యను 20వ వార్డు ప్రజలు మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున స్వామి, స్థానిక కౌన్సిలర్ గుర్రం కావ్య--పరుశరాములు గౌడ్ దృష్టికి తీసుకెళ్లారు. రోడ్డు నిర్మాణం లేక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించి, మడిపల్లి రైల్వే గేటు నుంచి రైల్వే స్టేషన్ క్యాబిన్ వరకు సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. వార్డు ప్రజల విజ్ఞప్తిపై స్పందించిన మున్సిపల్ చైర్మన్, కమిషనర్, స్థానిక కౌన్సిలర్ సమస్యను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మడిపల్లి రైల్వే గేటు నుంచి స్టేషన్ క్యాబిన్ వరకు సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు కృషి చేస్తామని తెలిపారు. దీంతో రోడ్డు సమస్యకు పరిష్కారం లభిస్తుందని వార్డు ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు సౌకర్యం లేకపోవడంతో ముఖ్యంగా వర్షాకాలంలో రాకపోకలకు మరింత ఇబ్బందులు ఎదురవుతున్నాయని ప్రజలు పేర్కొన్నారు. రహదారి నిర్మాణం పూర్తయితే స్థానిక ప్రజలతో పాటు రైల్వే స్టేషన్‌కు వెళ్లే ప్రయాణికులకు కూడా సౌకర్యంగా ఉంటుందని తెలిపారు. ఇచ్చిన హామీ మేరకు అధికారులు త్వరితగతిన చర్యలు తీసుకుని సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించాలని వార్డు ప్రజలు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలు బి. తిరుపతి, సిహెచ్. రజిత, జి. స్వరూప, బి. మాధవి, బి. శ్రీనివాస్, జి. శ్రీనివాస్, జి. అరుణ, వి. సంపత్, ఆర్. గణేష్, సిహెచ్. వేణు తదితరులు పాల్గొన్నారు

# కవులు,కళాకారులకు పుట్టినిల్లు కరీంనగర్

- మధుపాలీస్ "క్యాలెండర్ ఆఫ్ ఈవెంట్స్" బుక్ అద్భుతం
- కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్

**( వకుళాభరణం భానుప్రకాష్ ప్రజాతీర్పు బ్యూరో చీఫ్ కరీంనగర్) సెప్టెంబర్ 16**




కవులు, కళాకారుల పుట్టినిల్లు కరీంనగర్ అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. తాను దేశమంతా పర్యటిస్తున్నానని, అనేక కార్యక్రమాల్లో పాల్గొంటున్నాని చెప్పిన బండి సంజయ్ కరీంనగర్ లో ఉన్నంత మంది కవులు, కళాకారులు మరే జిల్లాలోనూ లేరని చెప్పారు. సమాజానికి ఎంతో సేవ చేస్తున్న కవులు, కళాకారులు పుట్టిల్లు కరీంనగర్ నుండి తాను ఎంపీగా, మంత్రిగా కొనసాగడం చాలా సంతోషంగా ఉందన్నారు. బుధవారం కరీంనగర్ లోని మంకమ్మ తోట సాయి మానేరు స్కూల్ లో కవి, రచయిత, ఎస్సారార్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్, లయన్ కెప్టెన్ డాక్టర్ మధుసూదన్ రెడ్డి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ సమకాలీన అంశాలపై రాసిన ఆర్టికల్స్ తో రూపొందించిన పుస్తకాన్ని మధుపాలీస్ "క్యాలెండర్ ఆఫ్ ఈవెంట్స్' పేరుతో కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి బండి సంజయ్ తోపాటు కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, కార్పొరేటర్, బీజేపీ కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్ రావు, మానేరు స్కూల్స్ అధినేత అనంత రెడ్డి, టీబీఎస్ఎస్ అధ్యక్షులు దాస్యం సేనాధిపతి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి ఏమన్నారంటే. దేశంలో ఎక్కడా లేనంత మంది కళాకారులు కరీంనగర్ లో వున్నారు. వీరంతా సమాజానికి ఎంతో సేవ చేస్తున్నారు. అందులో డాక్టర్ మధుసూదన్ రెడ్డి ఒకరు. ఇక్కడ నేను ఎంపీగా, మంత్రిగా ఉండటం నా అదృష్టం. మధుపాలీస్ "క్యాలెండర్ ఆఫ్ ఈవెంట్స్" పేరుతో లయన్ కెప్టెన్, ఎస్సారార్ కాలేజీ రిటైర్డ్ ప్రిన్సిపల్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి రాసిన ఆర్టికల్స్ ను ఈ విధంగా పుస్తక రూపంలో తీసుకురావడం, నా చేతుల మీదుగా ఆ పుస్తకాన్ని రిలీజ్ చేయడం చాలా సంతోషంగా ఉంది అన్నారు. ఎందుకంటే... ఈ 400 పేజీల పుస్తకం విద్యా సంస్థలకు, పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న యువతకు ఎంతో ఉపయోగపడుతుంది. కాలేజీ ప్రిన్సిపాల్ గా రిటైర్డ్ అయి విశ్రాంతి తీసుకోవాల్సిన మధుసూదన్ రెడ్డి అవిశ్రాంతంగా ఇలాంటి ఆర్టికల్స్ రాస్తూ సమాజానికి ఉపయోగపడే ఎన్నో కార్యక్రమాలు చేస్తున్నారు. రేపు ప్రధానమంత్రి మోదీ జన్మదినం. ఒకనాడు విదేశాలకు వెళతానంటే వీసా కూడా నిరాకరించిన దేశాలు సైతం నేడు మోదీ సేవలను చూసి రెడ్ కార్పెట్ తో స్వాగతం పలుకుతున్నాయి. ఆయన సాష్టాంగ పడుతున్నాయి. మోదీ సేవను చూసి సగటు భారతీయుడు సైతం నేను ఇండియన్ అని గల్లా ఎగిరేసేలా పని చేస్తున్నారు. అంతటి గొప్ప చరిత్ర కలిగిన మోదీ గురించి ఎన్నో విషయాలున్నాయని, వాటిని పుస్తక రూపంలో తెలుగు వాళ్లకు అందించాల్సిన అవసరం ఉంది. ధుసూదన్ రెడ్డిని కలవడం అంటే చరిత్రను తరచి చూడటమే. ఇలాంటి పుస్తకాన్ని ఆయన మాత్రమే రాయగలరు. మోదీ చరిత్రను పుస్తక రూపంలో తెలుగు ప్రజలకు అందించాలని మధుసూదన్ రెడ్డిని కోరుతున్నా. రేపు మోదీ జన్మదినం సందర్భంగా దేశమంతా ఆశీర్వాద దీపం వెలిగించి మోడీని ఆశీర్వదించేందుకు సిద్ధమైంది. అందులో భాగంగా కేంద్రం నుండి లబ్ది పొందిన ప్రతి ఒక్కరూ ఒక్కో దీపాన్ని వెలిగించాలని సంజయ్ కోరారు.



## బీఆర్ఎస్ దుష్ప్రచారాన్ని నమ్మొద్దు

- అభివృద్ధిని అడ్డుకునేందుకు ప్రతిపక్షాల కుట్ర
- ఏఐ డ్రామాలతో తప్పించుకోలేరు: కాల్వ సుజాతలిమల్కాజిగిరిలో ఘన సత్కారం

**(వినోద్, ప్రజా తీర్పు మల్కాజిగిరి) సెప్టెంబర్ 16**

బీఆర్ఎస్ నాయకులు అబద్ధాలు, దుష్ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని కాంగ్రెస్ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్, టీపీసీసీ అధికార ప్రతినిధి కాల్వ సుజాత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గతంలో తాము చేసిన తప్పులను కప్పిపుచ్చుకునేందుకే ప్రతిపక్ష నేతలు కాంగ్రెస్ ప్రభుత్వంపై బురదజల్లుతూ, సంక్షేమ-అభివృద్ధి కార్యక్రమాలను అడ్డుకునేందుకు యత్నిస్తున్నారని విమర్శించారు. ?కాంగ్రెస్ మల్కాజిగిరి జిల్లా కోఆర్డినేటర్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం బుధవారం ఆనంద్‌బాగ్‌లోని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు క్యాంపు కార్యాలయంలో ఆమె విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ఆమెను పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ?ఈ సందర్భంగా కాల్వ సుజాత మాట్లాడిన ప్రధాన అంశాలు: ?డ్రామాలను ప్రజలు గమనిస్తున్నారు: పీసీసీ ఆదేశాల మేరకు ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్తామని తెలిపారు. అసెంబ్లీలో ప్రతిపక్షాల హంగామాను, ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనపై చేస్తున్న అసత్య ప్రచారాలను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ నేతలు చేసిన రాద్ధాంతం వీడియోల ద్వారా బయటపడితే, వాటిని కృత్రిమ మేధస్సు (ా×) సృష్టించిందని చెప్పి తప్పించుకోవాలని చూడటం హాస్యాస్పదమన్నారు. ?22ఏ భూములపై ఆందోళన వద్దు: 22ఏ భూముల సమస్యపై సామాన్యులకు ఎలాంటి నష్టం జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. ఈ అంశంపై అసెంబ్లీలో వివరణ ఇచ్చేందుకు ముఖ్యమంత్రి సిద్ధంగా ఉన్నప్పటికీ బీఆర్ఎస్ సభ్యులు సభకు రాకుండా పారిపోతున్నారని ఎద్దేవా చేశారు. ?ఓటర్ నమోదు వేగవంతం: మల్కాజిగిరి నియోజకవర్గంలో ఎస్ఐఆర్ (ా×=) ప్రక్రియ ఇప్పటివరకు 62.5 శాతం పూర్తి కావడం శుభపరిణామమని తెలిపారు. ఇంకా 20 రోజుల గడువు ఉన్నందున అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా కాంగ్రెస్ శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ?ఈ కార్యక్రమంలో ఎస్ఐఆర్ ఇన్‌చార్జి షమీర్ కౌశల్, బీఎల్ఏలు, స్థానిక కాంగ్రెస్ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## జల్లేరు వాగు హత్య కేసు ఛేదన

- మద్యం మత్తులో ఇంటి వద్ద గొడవ.. కుటుంబాన్ని చంపుతానని బెదిరించడంతో కత్తితో దాడిలి
- నిందితుడి అరెస్ట్ హత్యకు ఉపయోగించిన కత్తి స్వాధీనం

**(పొనకంటి ఉపేందర్ రావు ప్రజాతీర్పు) సెప్టెంబర్ 16**




ఆళ్లపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల జరిగిన హత్య కేసును పోలీసులు ఛేదించారు. అనుమానితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా హత్యకు సంబంధించిన వివరాలు వెలుగులోకి వచ్చినట్లు పోలీసులు బుధవారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో డి.ఎస్.పి వెంకన్న బాబు వెల్లడించారు. ఈ నెల 11న రాత్రి మర్కోడు గ్రామ శివారులోని జల్లేరు వాగు వద్ద పూనెం నారాయణ ( రామనారాయణ) మృతదేహం లభించిన విషయం తెలిసిందే. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు అనుమానితులను విచారించడంతో పాటు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ క్రమంలో సుద్దరేవు గ్రామానికి చెందిన కొమరం రామనాథం (59), ఎస్టీ కోయపై అనుమానం రావడంతో అదుపులోకి తీసుకుని విచారించారు. పోలీసుల వివరాల ప్రకారం.. మృతుడు పూనెం నారాయణ కొంతకాలంగా రామనాథం ఇంటి వద్ద ఉంటూ వ్యవసాయ పనుల్లో సహాయపడేవాడు. మద్యం సేవించే అలవాటు కారణంగా కుటుంబ సభ్యులతో తరచూ గొడవలు జరిగేవని తెలిపారు. ఈ నెల 11న రాత్రి మద్యం సేవించి రామనాథం ఇంటికి వచ్చి గొడవపడటంతో అతడిని ఇంటి నుంచి బయటకు పంపించాడు. అనంతరం రామనాథం మనవరాలిని క్షుద్రపూజలు చేసి చంపుతానని నారాయణ బెదిరించినట్లు పోలీసులు తెలిపారు. దీంతో ఆగ్రహించిన రామనాథం అదే రాత్రి సుమారు 11 గంటల సమయంలో ఇంటి వద్ద ఉన్న కత్తిని తీసుకుని జల్లేరు వాగు వద్దకు వెళ్లాడు. అక్కడ నారాయణ పూజలు చేస్తున్న సమయంలో అతనితో గొడవపడి కత్తితో దాడి చేసినట్లు విచారణలో వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. అనంతరం మృతదేహాన్ని అక్కడే వదిలి, కత్తిని సంఘటనా స్థలానికి దక్షిణ దిశలో సుమారు 20 మీటర్ల దూరంలోని పొదల్లో పడేసినట్లు నిందితుడు తెలిపాడన్నారు. నిందితుడు చూపించిన ప్రదేశంలో పంచుల సమక్షంలో పోలీసులు కత్తిని స్వాధీనం చేసుకున్నారు. దానిని సీజ్ చేసి శాస్త్రీయ పరీక్షల నిమిత్తం పంపించే చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కేసుకు సంబంధించిన ఇతర సాక్ష్యాలు, శాస్త్రీయ ఆధారాల సేకరణ కొనసాగుతోందని, దర్యాప్తు అనంతరం చట్ట ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని పోలీసులు వెల్లడించారు. పోలీసు అధికారులకు అభినందనలు కేసును త్వరితగతిన ఛేదించేందుకు కృషి చేసిన టేకులపల్లి సీఐ బత్తుల సత్యనారాయణ, ఆళ్లపల్లి ఎస్ఐ సోమేశ్వర్, టేకులపల్లి ఎస్ఐ తిరుపతి తో పాటు పోలీసు సిబ్బందిని ఇల్లందు డీఎస్పీ వెంకన్న బాబు ప్రత్యేకంగా అభినందిచారు .

# పిల్లలకు ప్రభుత్వం ఇవ్వగలిగే గొప్ప ఆస్తి విద్య

- ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యం
- విద్యార్థుల ఆకలిని తరిమి అక్షరానికి అండగా నిలవడమే ధ్యేయం
- మంత్రి పొన్నం ప్రభాకర్

**( వకుళాభరణం భానుప్రకాష్ ప్రజాతీర్పు బ్యూరో చీఫ్ కరీంనగర్) సెప్టెంబర్ 16**



పిల్లలకు ప్రభుత్వం ఇవ్వగలిగే గొప్ప ఆస్తి విద్య మాత్రమేనని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు అవసరమైన మౌలిక వసతులు కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. విద్యార్థులు ఉదయం ఆకలితో తరగతి గదులకు రాకుండా వారికి నాణ్యమైన, పోషకాహారంతో కూడిన అల్పాహారం అందించి ఆకలిని తరిమి అక్షరానికి అండగా నిలవడమే స్కూల్ బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమం ఉద్దేశమని పేర్కొన్నారు. కరీంనగర్ మార్కెట్‌యార్డులో తెలంగాణ ప్రభుత్వం, హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ఇండియా ఇంప్లిమెంటేషన్ పార్ట్‌నర్‌గా కలిసి సుమారు రూ.8 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన భారీ సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్‌ను బుధవారం మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రాతో కలిసి ప్రారంభించారు. అనంతరం కిచెన్‌లో ఏర్పాటు చేసిన అధునాతన సాంకేతిక పరికరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ గతంలో విద్యార్థుల ఎదుగుదలకు భూములు, నిధులు వంటి ఆస్తులు ఉండేవని, ఇప్పుడు పిల్లలకు ప్రభుత్వం ఇవ్వగలిగే గొప్ప ఆస్తి విద్య మాత్రమేనని అన్నారు. ఇటీవల జరిగిన సిప్ సర్వేలో ఉన్నత స్థాయిలో ఉన్న కుటుంబాలను పరిశీలించినప్పుడు ఉన్నత చదువులు చదివిన కుటుంబాలే మెరుగైన స్థాయిలో ఉన్నట్లు గుర్తించిన విషయాన్ని ప్రస్తావించారు. అందుకే ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనేక మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని, శిక్షణ పొందిన ఉపాధ్యాయులను అందుబాటులో ఉంచుతున్నామని, ఇప్పుడు విద్యార్థులకు ఉదయమే నాణ్యమైన అల్పాహారం అందించే కార్యక్రమాన్ని కూడా చేపట్టామని మంత్రి తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి తల్లిదండ్రులు మద్దతు ఇవ్వాలని కోరారు.

### ఆకలితో చదువుకు ఆటంకం ఉండొద్దు

ఆకలితో ఉన్న పిల్లవాడు చదువుపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టలేడని మంత్రి అన్నారు. విద్యార్థులకు ఉదయమే పోషకాహారంతో కూడిన అల్పాహారం అందించడం ద్వారా వారి ఏకాగ్రత, జ్ఞానాత్మక సామర్థ్యం, తరగతి గది భాగస్వామ్యం మెరుగుపడేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. విద్యార్థుల హాజరు, సమయపాలన, విద్యా పనితీరు మెరుగుపడేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని తెలిపారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు, ముఖ్యంగా ఉదయమే ఉపాధి కోసం వెళ్లే తల్లిదండ్రులకు ఈ కార్యక్రమం ఆర్థికంగా, సమయపరంగా ఉపశమనం కల్పిస్తుందని అన్నారు. ఉపాధ్యాయులు వంట, ఆహార నిర్వహణ బాధ్యతల నుంచి విముక్తి పొంది బోధనపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.

### కరీంనగర్‌లో 49,025 మందికి అల్పాహారం

కరీంనగర్‌లో సుమారు రూ.8 కోట్లతో ఏర్పాటు చేసిన ఈ సెంట్రలైజ్డ్ కిచెన్‌కు రోజుకు 50 వేల మంది విద్యార్థులకు అల్పాహారం అందించే సామర్థ్యం ఉందని మంత్రి తెలిపారు. 17 మండలాల్లోని 669 ప్రభుత్వ పాఠశాలలు, 11 ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు ఈ బ్రేక్‌ఫాస్ట్ సేవలు అందుతాయని చెప్పారు. మొత్తం 49,025 మంది విద్యార్థులు ప్రతిరోజూ ప్రయోజనం పొందుతారని వివరించారు. కరీంనగర్, హుస్నాబాద్, చొప్పదండి, మానకొండూర్ నియోజకవర్గాల విద్యార్థులకు ఈ కిచెన్ ద్వారా అల్పాహారం అందుతుందని తెలిపారు. నియోజకవర్గాల వారీగా హుస్నాబాద్‌లో 16,544 మంది, మానకొండూర్‌లో 8,645 మంది, చొప్పదండిలో 7,481 మంది, కరీంనగర్‌లో 16,355 మంది విద్యార్థులు లబ్ధి పొందుతారని చెప్పారు. రాష్ట్రంలో ఇది ఆరవ కమ్యూనిటీ కిచెన్ అని మంత్రి తెలిపారు. ఇక్కడి నుంచి 17 మండలాల్లో దాదాపు 50 వేల మంది విద్యార్థులకు అల్పాహారం పంపిణీ జరుగుతుందని చెప్పారు.

### అధునాతన యంత్రాలతో ఆహార తయారీ

కిచెన్‌లో అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో ఇడ్లీ, దోశ, పూరీ, బోండా, సాంబార్ తయారు చేసే మిషన్లు ఏర్పాటు చేశారని మంత్రి తెలిపారు. పాత్రలు శుభ్రం చేసే మిషన్లు, పాల కేంద్రం, ఆహార పదార్థాల టెస్టింగ్ ల్యాబ్, కూరగాయలు కట్ చేసే మిషన్లు, కూరగాయలు కడిగే మిషన్లు, చట్నీ పౌడర్ తయారీ మిషన్లు కూడా ఏర్పాటు చేశారని చెప్పారు. వాటి పనితీరును స్వయంగా పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులకు ఒకే విధమైన నాణ్యతతో, పరిశుభ్రంగా అల్పాహారం అందించడమే కేంద్రీకృత వంటశాలల ఉద్దేశమని మంత్రి తెలిపారు. ఆహార భద్రత, పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తూ ఐఎస్ఓ స్థాయి ప్రమాణాలను పాటించేలా ఏర్పాట్లు చేశామని చెప్పారు. థర్మల్ ఇన్సులేటెడ్ వాహనాల ద్వారా పాఠశాలలకు సకాలంలో అల్పాహారం తరలిస్తామని తెలిపారు. విద్యార్థులకు ఇష్టమైన, సాధారణంగా ఇళ్లలో తినే ఆహార పదార్థాలతో మెనూ రూపొందించామని, మెనూ రూపకల్పనలో ఎన్ఐఎన్ సహకారం తీసుకున్నామని చెప్పారు.

### రాష్ట్రవ్యాప్తంగా 17.72 లక్షల మంది విద్యార్థులకు

రాష్ట్రవ్యాప్తంగా సుమారు 17,72,291 మంది విద్యార్థులకు ప్రయోజనం కల్పించేలా స్కూల్ బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమాన్ని విస్తరించే ప్రతిపాదనలు ఉన్నాయని మంత్రి తెలిపారు. 23,106 ప్రభుత్వ పాఠశాలలను కార్యక్రమం పరిధిలోకి తీసుకురానున్నామని చెప్పారు. 31 జిల్లాల్లో 31 కేంద్రీకృత మెగా/కమ్యూనిటీ కిచెన్లు ఏర్పాటు చేసే ప్రణాళిక ఉందని, వీటి కోసం రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ.245 కోట్ల వ్యయం అంచనా వేసినట్లు తెలిపారు. అల్పాహారం పంపిణీకి సుమారు 1,400 వాహనాలు, 5,000 మంది సిబ్బంది అవసరమవుతారని చెప్పారు. కేంద్రీకృత వంటశాలల ద్వారా సుమారు 15,000 ప్రత్యక్ష, 10,000 పరోక్ష ఉద్యోగ అవకాశాలు కల్పించే అవకాశం ఉందన్నారు.

### హరే కృష్ణ మూవ్‌మెంట్‌కు ధన్యవాదాలు

స్కూల్ బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమంలో ఇంప్లిమెంటేషన్ పార్ట్‌నర్‌గా వ్యవహరిస్తున్న హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ఇండియా ప్రపంచవ్యాప్తంగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని మంత్రి తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం సిఎస్ఆర్ నిధుల కింద సంస్థకు సహకరిస్తోందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన అల్పాహారం అందించే కార్యక్రమంలో భాగస్వామిగా నిలిచినందుకు తెలంగాణ ప్రభుత్వం తరపున ఫౌండేషన్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, అదనపు కలెక్టర్ అశ్వినీ తానాజీ వాకడే, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ఇండియా ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కౌంటియా దాస స్వామీజీ, కరీంనగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న, ఆర్టీఏ మెంబర్ పడాల రాహుల్, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన పోలీస్ కమిషనర్

**(వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) సెప్టెంబర్ 16**



రామగుండం పోలీస్ కమిషనరేట్ మంచిర్యాల జోన్ పరిధిలో ని రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీలలో భాగంగా రామగుండం పోలీస్ కమిషనర్ తనిఖీ చేశారు.ఈ సందర్భంగా రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న పోలీస్ కమిషనర్ కు రామకృష్ణాపూర్ ఎస్ఐ శ్రీధర్, సీఐ రమేష్ మొక్కను అందజేసి స్వాగతం పలికారు.అనంతరం పోలీస్ సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో పోలీస్ అధికారులతో కలిసి మొక్కను నాటారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి, ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలను క్రమబద్ధంగా ఉంచడంతో పాటు, వాటికి సంబంధించిన వివరాలను సక్రమంగా నమోదు చేసి నిర్వహించాలని సూచించారు. రిసెప్షన్ కేంద్రం సిబ్బందితో మాట్లాడి రికార్డులను పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌లో 5ఎస్ విధానాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని, సిబ్బంది బ్యారక్‌ను తనిఖీ చేసి పరిశుభ్రంగా ఉంచాలని, అన్ని రికార్డులను క్రమబద్ధంగా నిర్వహించాలని సూచించారు.స్టేషన్ రైటర్, సీసీటీఎన్ఎస్ రైటర్లతో మాట్లాడి ఆన్‌లైన్‌లో వివరాల నమోదు, రికార్డుల అప్‌లోడ్ ప్రక్రియను పరిశీలించారు. అనంతరం పోలీస్ స్టేషన్ సిబ్బందితో మాట్లాడి వారి వ్యక్తిగత, శాఖాపరమైన అంశాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కువగా నమోదవుతున్న నేరాలు,పెండింగ్ కేసులు, దర్యాప్తు పురోగతి, రౌడీషీటర్లు, హిస్టరీషీటర్ల కదలికలు,విజిబుల్ పోలీసింగ్,పెట్రోలింగ్ తదితర అంశాలపై స్టేషన్ ఎస్ఐను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారు, బాధితుడితో మర్యాదపూర్వకంగా,మానవీయ దృక్పథంతో వ్యవహరించాలని సూచించారు.వారి సమస్యలను పూర్తిగా తెలుసుకుని, చట్టపరిధిలో త్వరితగతిన,పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్ కీలకమైన ప్రాంతంలో ఉందని,హైవే,రైల్వే స్టేషన్‌తో పాటు కొత్త కాలనీలు అభివృద్ధి చెందుతున్నందున్నారు శాంతిభద్రతలు, రహదారి భద్రత, మహిళల భద్రత, మాదకద్రవ్యాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సీపీ సూచించారు. ముఖ్యంగా రైలు, రోడ్డు మార్గాల ద్వారా జరిగే గంజాయి అక్రమ రవాణాను అరికట్టేందుకు నిఘా, సమాచార వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని ఆదేశించారు. ప్రజల భాగస్వామ్యంతో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయించి, ఆస్తి నేరాల నియంత్రణలో మంచి ఫలితాలు సాధిస్తున్న పోలీస్ సిబ్బందిని సీపీ అభినందించారు. కొత్త కాలనీల్లో వృద్ధుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ, బ్లూకోట్స్ సిబ్బంది క్రమం తప్పకుండా పర్యటించి భద్రతా పరిస్థితులను పరిశీలించాలని సూచించారు. వృద్ధుల భద్రత కోసం ప్రత్యేక ప్రామాణిక కార్యాచరణ విధానం ( ఎస్ఓపి ) రూపొందించి అమలు చేయాలని ఆదేశించారు. పోలీస్ సిబ్బంది శారీరక దృఢత్వంతో పాటు పోలీస్ స్టేషన్ నిర్వహణపై కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సీఐ, ఎస్ఐలకు సూచించారు. రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్ నిర్వహణ బాగుందని పేర్కొంటూ,ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేలా సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సీపీ ఆదేశించారు.

## ఓజోన్ పొరను కాపాడితేనే.. భవిష్యత్ తరాలకు రక్షణ

### చిన్నారులకు అవగాహన కల్పించిన విద్యార్థిని అర్ఫా మెహ్రీన్

**(ఇమ్రాన్ జోహ్రా, ప్రజాతీర్పు, హైదరాబాద్) సెప్టెంబరు 16**




ఓజోన్ పొర పరిరక్షణ ప్రాధాన్యతపై విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు హైదరాబాద్ అత్తాపూర్‌లోని ఎనారా హైస్కూల్‌లో రెండో తరగతి చదువుతున్న యువ పర్యావరణ ఆసక్తికరురాలు అర్ఫా మెహ్రీన్ కరీంనగర్ బొమ్మకల్‌లోని ది లెర్నింగ్ వరల్డ్ స్కూల్లో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా అర్ఫా మెహ్రీన్ ఓజోన్ పొర భూమిని సూర్యుడి నుంచి వెలువడే హానికరమైన అతినీలలోహిత (యువి) కిరణాల నుంచి ఎలా రక్షిస్తుందో విద్యార్థులకు వివరించింది. రంగురంగుల విద్యా పోస్టర్ ద్వారా ఓజోన్ పొర ప్రాధాన్యతను, అది మానవ ఆరోగ్యం, మొక్కలు, జంతువులు, పర్యావరణ పరిరక్షణకు అందించే రక్షణను వివరించింది. పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, హానికరమైన ఉత్పత్తులను నివారించాలని, విద్యుత్‌ను ఆదా చేయాలని, వ్యర్థాలను తగ్గించాలని, మొక్కలు నాటాలని విద్యార్థులకు సూచించింది. చిన్న వయస్సులోనే పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తూ అర్ఫా మెహ్రీన్ నిర్వహించిన కార్యక్రమం విద్యార్థుల్లో పర్యావరణ బాధ్యతపై ఆసక్తిని పెంచింది. "ఓజోన్ పొరను కాపాడండి –మన భవిష్యత్తును కాపాడండి!" అనే సందేశంతో కార్యక్రమం కొనసాగింది.




## అక్రమంగా తరలిస్తున్న 12 పశువుల వాహనాన్ని పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ బృందం

### పరారీలో నిందితుడు

**(వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) సెప్టెంబర్ 16**

రామగుండం పోలీస్ కమిషనరేట్ మంచిర్యాల జోన్ పరిధిలోని మందమర్రి ప్రాంతంలో అక్రమంగా పశువులను తరలిస్తున్న వాహనాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు,పట్టుకున్నారు.ఈ సందర్భంగా 12 పశువులతో పాటు మహీంద్రా క్యాంపర్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు,టాస్క్‌ఫోర్స్ ఏసీపీ శ్రీనివాస్ రావు నేతృత్వంలో బుధవారం అందిన విశ్వసనీయ సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ లచ్చన్న,సిబ్బంది మందమర్రి టోల్‌ప్లాజా వద్ద వాహనాల తనిఖీలు చేపట్టారు.ఈ క్రమంలో ఆసిఫాబాద్ జిల్లా నుంచి జగిత్యాల జిల్లాలోని రాజారాంపల్లె మార్కెట్‌కు పశువులను అక్రమంగా తరలిస్తున్న మహీంద్రా క్యాంపర్ వాహనాన్ని పోలీసులు ఆపి తనిఖీ చేశారు. వాహనంలో 8 ఆవులు,4 దూడలు, మొత్తం 12 పశువులు ఉన్నట్లు గుర్తించారు.దీంతో పశువులతో పాటు మహీంద్రా క్యాంపర్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు వాహనాన్ని ఆపిన సమయంలో డ్రైవర్ వారిని గమనించి వాహనం నుంచి దిగి అక్కడి నుంచి పరారయ్యాడు. పరారీలో ఉన్న డ్రైవర్‌ను పట్టుకునేందుకు పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.స్వాధీనం చేసుకున్న 12 పశువులు, మహీంద్రా క్యాంపర్ వాహనాన్ని తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం మందమర్రి పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్ఓ కు అప్పగించారు.

# మక్కా లక్ష్యంగా హౌతీల దాడి



- సౌదీ అరేబియా ఆరోపణ
- అబద్ధమని ఖండించిన రెబల్స్

మక్కా లక్ష్యంగా హౌతీల దాడి ముస్లింల పవిత్ర నగరమైన మక్కా లక్ష్యంగా హౌతీలు బుధవారం దాడి చేసినట్టు సౌదీ నేతృత్వంలోని సంకీర్ణ కూటమి ఆరోపించింది. ఈ ఆరోపణలు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ముస్లింలలో ఆగ్రహాన్ని రేకెత్తించాయి. దీంతో ఈ ప్రాంతాన్ని అల్లకల్లోలం చేస్తున్న సంఘర్షణను మరింత తీవ్రతరం చేశాయి. కాగా, మక్కా లక్ష్యంగా తాము దాడులు చేశామంటూ రియాద్ చేస్తున్న ఆరోపణలను హౌతీలు ఖండించారు. ముస్లింల పవిత్ర నగరమైన మక్కా లక్ష్యంగా హౌతీలు బుధవారం దాడి చేసినట్టు సౌదీ నేతృత్వంలోని సంకీర్ణ కూటమి ఆరోపించింది. ఈ ఆరోపణలు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ముస్లింలలో ఆగ్రహాన్ని రేకెత్తించాయి. దీంతో ఈ ప్రాంతాన్ని అల్లకల్లోలం చేస్తున్న సంఘర్షణను మరింత తీవ్రతరం చేశాయి. కాగా, మక్కా లక్ష్యంగా తాము దాడులు చేశామంటూ రియాద్ చేస్తున్న ఆరోపణలను హౌతీలు ఖండించారు. సౌదీ నగరం మక్కా లక్ష్యంగా తాము ప్రయోగించిన డ్రోన్‌ను కూల్చివేశామని రియాద్ చేసిన ప్రకటన అబద్ధమని హౌతీ స్పష్టం చేసింది. 'మక్కాను లక్ష్యంగా చేసుకున్నారన్న ఆరోపణలు గతంలోనూ వాడిన పాత అబద్ధాలే. అవి ఇక ఎవరినీ మోసం చేయలేవు' అని హౌతీల పొలిట్‌బ్యూరోకు చెందిన హాజీమ్-అల్-అస్సాద్ ఎక్స్‌లో పేర్కొన్నారు. ఎర్ర సముద్రం మీదుగా పోయే నౌకలపై దిగ్బంధాన్ని ప్రకటించిన హౌతీలు ఆ దేశానికి సవాల్‌గా మారారు. గత వారం మెరుపు దాడులు నిర్వహించిన హౌతీలు యెమెన్‌లోని ఎర్రసముద్ర తీరం, బాబ్ ఎల్-మాండెబ్ జలసంధిని తమ ఆధీనంలోకి తెచ్చుకున్నారు.



## బీర్పూర్ మండల స్థాయి ఎస్ జి ఎఫ్ క్రీడా పోటీలు

- కార్యక్రమాన్ని ప్రారంభించిన బీర్పూర్ గ్రామ సర్పంచ్ హరీష్
- ఎస్ జి ఎఫ్ మండల చైర్ పర్సన్ శ్రీ సిరుప నాగభూషణం (మండల విద్యాధికారి)

**( కుమారస్వామి ప్రజా తీర్పు జగిత్యాల రూరల్) సెప్టెంబర్ 16**

బీర్పూర్ మండలంలోని పీఎం శ్రీ జడ్పీహెచ్ఎస్ బీర్పూర్ ఆవరణలో నేడు మండల స్థాయి క్రీడలు ప్రారంభించడం జరిగింది . ఈ క్రీడ కార్యక్రమంలో మండలంలోని వివిధ పాఠశాలల నుండి విద్యార్థులు మూడు రోజుల పాటు జరిగే క్రీడా పోటీలలో పాల్గొంటారు ఈ కార్యక్రమానికి చైర్ పర్సన్ గా నాగభూషణం (మండల విద్యాధికారి) ఉన్నారు, కన్వీనర్ మంజుల ధరణి పిటి వివిధ పాఠశాల నుండి వచ్చే విద్యార్థులకు అండర్ 14 అండర్ 17 రెండు కేటగిరీలలో కోకో వాలీబాల్ కబడ్డీ అథ్లెటిక్స్ వివిధ క్రీడా పోటీలను నిర్వహించడం జరుగుతుంది . ఈ కార్యక్రమానికి వనరులను అనగా పాల్గొనే విద్యార్థిని విద్యార్థులకు మధ్యాహ్న భోజనమును ఉచితంగా సూర్య పబ్లిక్ స్కూల్ వివేకానంద స్కూల్ అక్షర స్కూల్ యాజమాన్యాలు అందించడం జరిగింది . అలాగే క్రీడలలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు ప్రైసెస్ మెమొంటోలను శ్రీరామ స్కూల్ యాజమాన్యం అందించడం జరుగుతుంది.. నేటి కార్యక్రమంలో మండల విద్యాధికారి స్వరూప నాగభూషణం బీర్పూర్ గ్రామ సర్పంచ్ హరీష్ బీర్పూర్ సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు, ఎస్ జి ఎఫ్ కన్వీనర్ మంజుల ధరణి గారు,మండల మండల పాఠశాలల వివిధ ప్రధానోపాధ్యాయులు, పి ఈటిలు, పీడీలు,సి ఆర్ పి లు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



## భూ తగాదాతో దారుణ హత్య

- తనుగుల హత్య కేసులో ముగ్గురు అరెస్ట్, ఆధారాలు స్వాధీనం

**జమ్మికుంట సెప్టెంబర్ 16 ప్రజాతీర్పు**

జమ్మికుంట పోలీస్ స్టేషన్ పరిధిలోని తనుగుల గ్రామంలో జరిగిన బొజ్జపల్లి రాజబాబు హత్య కేసును పోలీసులు 24 గంటల్లోనే ఛేదించారు. భూ వివాదం, కుటుంబ తగాదాల నేపథ్యంలోనే ఈ హత్య జరిగినట్లు పట్టణ సీఐ రామకృష్ణ గౌడ్ తెలిపారు. కేసు వివరాల్లోకి వెళితే మృతుడు రాజబాబు తన తల్లి లచ్చమ్మకు చెందిన భూమిని అమ్మాలని తరచూ కుటుంబ సభ్యులతో గొడవపడేవాడు. పంచాయితీలో భూమిని మూడు భాగాలుగా పంచినా అంగీకరించక, మొత్తం భూమి తనకే కావాలని పట్టుబట్టాడు. ఈ క్రమంలో ఈ నెల 10న మద్యం సేవించి తన బావ జూపాక శంకర్ ఇంటికి వెళ్లి, తల్లి లచ్చమ్మ, అక్క కవితలతో గొడవపడి భౌతికదాడికి దిగాడు.కోపంతో అక్కడే ఉన్న జూపాక శంకర్, చేతి వెంకటేష్, మారపెల్లి రాజయ్య, జూపాక సతీష్‌లు రాజబాబును పట్టుకుని కొట్టి మంచానికి కట్టేశారు. అనంతరం చున్నీతో మెడ బిగించి హత్య చేశారు. అదే రాత్రి మృతదేహాన్ని సైకిల్‌పై పొలానికి తరలించి, గుంత తవ్వి పూడ్చిపెట్టారు.

ఘటనపై దర్యాప్తు చేపట్టిన జమ్మికుంట పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. హత్యకు, మృతదేహం తరలింపునకు ఉపయోగించిన సైకిల్, పార, గడ్డపార, చున్నీని స్వాధీనం చేసుకున్నారు. వేగంగా స్పందించి కేసును ఛేదించిన సీఐ రామకృష్ణ, పోలీస్ సిబ్బందిని పలువురు అభినందించారు.కుటుంబ, భూ వివాదాలు ఉన్నప్పుడు ప్రజలు చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకూడదని, పోలీస్ స్టేషన్ లేదా న్యాయస్థానాలను ఆశ్రయించి సమస్యలను చట్టబద్ధంగా పరిష్కరించుకోవాలని జమ్మికుంట పోలీసులు తెలిపారు.



## గోలియాతండాలో ఘనంగా ప్రపంచ నాయి బ్రాహ్మణ దినోత్సవ వేడుకలు

### కులవృత్తిదారులకు బీమా సౌకర్యం కల్పించాలి

**(పొనకంటి ఉపేందర్ రావు ప్రజాతీర్పు) సెప్టెంబర్ 16**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం గోలియాతండా గ్రామపంచాయతీలో బుధవారం ప్రపంచ నాయి బ్రాహ్మణ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.నాయి బ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షులు మావునూరి రమేష్ ఆధ్వర్యంలో నాయి బ్రాహ్మణ కులవృత్తుల జెండా ఆవిష్కరణ, కుల పెద్దల సన్మాన కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టేకులపల్లి సర్పంచ్ బోడ బాలు నాయక్, గోలియాతండా సర్పంచ్ లకావత్ నాకా నాయక్ హాజరయ్యారు.అనంతరం మావునూరి రమేష్ మాట్లాడుతూ నాయి బ్రాహ్మణ కులవృత్తిని నమ్ముకుని జీవిస్తున్న పేద కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. కులవృత్తిదారులకు రూ.10 లక్షల ప్రమాద బీమా, ఆరోగ్య బీమా, ప్రతి మండలంలో కుల భవనం, విద్యార్థులకు స్కాలర్ షిప్ లు, కార్పొరేషన్ ద్వారా ఆధునిక సెలూన్ షాపులకు రుణ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి ఉమేష్, మావునూరి రాజు, జనగాం లక్ష్మయ్య, వంశీ, వెంకన్న, రాజు, అశోక్, రాజన్న, ముదిగొండ రాజు, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## 24 గంటలు దవాఖానలో ఉండలేదని బీమా క్లెయిమ్ తిరసరించలేరు

హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ పరిధిలో ఉన్న వ్యాధికి కొనసాగింపుగా అందించే చికిత్సకు 24 గంటల హాస్పిటల్ అడ్మిషన్ లేదన్న కారణంతో బీమా క్లెయిమ్‌ను తిరసరించ లేరని కర్ణాటక హైకోర్టు స్పష్టం చేసింది. దవాఖానలో అడ్మిట్ కావడం చికిత్స అందించే విధానాల్లో ఒకటేనని, చికిత్స స్వభావం, అది పాలసీలో కవర్ చేసిన వ్యాధికి సంబంధించినదా, వైద్యపరంగా అవసరమైనదా, పాలసీలో స్పష్టమైన మినహాయింపు ఉందా అనే అంశాలను పరిశీలించాల్సి ఉంటుందని జస్టిస్ సూరజ్ గోవిందరాజ్ పేరొన్నారు. అయితే ఈ తీర్పుతో ప్రతి ఓపీ చికిత్సకు ఆటోమేటిక్‌గా హెల్త్ ఇన్సూరెన్స్ వర్తిస్తుందని భావించ రాదని కోర్టు స్పష్టం చేసింది.

# ఐలాపూర్ మహిళపై దాడి ఘటనపై పోలీసుల వివరణ

### సోషల్ మీడియాలో ప్రచారం అవాస్తవం: మెట్పల్లి డీఎస్పీ రాములు

**కోరుట్ల, సెప్టెంబర్ 16 (ప్రజాతీర్పు)**



కోరుట్ల మండలం ఐలాపూర్ గ్రామంలో మహిళపై దాడి ఘటనకు సంబంధించి సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని మెట్పల్లి డీఎస్పీ ఎ. రాములు తెలిపారు. ఆగస్టు 24న ఓ మహిళ ఇంటి నుంచి వెళ్లిపోవడంతో ఆమె భర్త కోట దుర్గయ్య ఆగస్టు 25న కోరుట్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సెప్టెంబర్ 2న సదరు మహిళ, ఆమె భర్త తమ్ముడు జగిత్యాల పట్టణ పోలీస్ స్టేషన్‌కు వెళ్లగా మహిళ స్టేట్‌మెంట్‌ను నమోదు చేసి కౌన్సెలింగ్ ఇచ్చినట్లు పేర్కొన్నారు. అనంతరం కోరుట్ల పోలీసులు కూడా కౌన్సెలింగ్ ఇచ్చి ఇరువురిని వారి ఇళ్లకు పంపించినట్లు తెలిపారు. తదుపరి ఐలాపూర్‌లో కుల పెద్దల సమక్షంలో పంచాయతీ జరగగా, తాను మరిదితోనే ఉంటానని మహిళ తెలిపినట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలో మహిళ తన మరిది వద్ద ఉంటుండగా, అతని మొదటి భార్య బంధువులైన తల్లి, అక్క తదితరులు ఇంటికి వచ్చి ఆమె ముఖంపై జీడిపొడి చల్లి కొట్టినట్లు ఫిర్యాదు అందిందన్నారు. మహిళ ఫిర్యాదు మేరకు సెప్టెంబర్ 15న కోరుట్ల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టినట్లు డీఎస్పీ తెలిపారు. అయితే మహిళ మర్మాంగాలపై కారం చల్లి, వివస్త్రను చేశారంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని ప్రాథమిక విచారణలో తేలిందన్నారు. మహిళ ముఖంపై మాత్రమే పదార్థం చల్లినట్లు ప్రాథమికంగా నిర్ధారణ అయిందని తెలిపారు. దర్యాప్తులో వెల్లడయ్యే ఆధారాల ఆధారంగా తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ రాములు వెల్లడించారు.

# మోడల్ స్కూల్ లో గురు సన్మాన మహోత్సవం



**హుస్నాబాద్ సెప్టెంబర్ 16 రవీందర్ ప్రజా తీర్పు**

చిగురుమామిడి మండలం చిన్న ముల్కనూర్ లోని మోడల్ స్కూల్ లో బుధవారం గురు సన్మాన మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమైందని, వారి సేవలను గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పలువురు వక్తలు పేర్కొన్నారు. టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ కరీంనగర్ బ్రాంచ్ ఆధ్వర్యంలో చిన్న ములకనూరు మోడల్ స్కూల్‌లో 'గురు సన్మాన మహోత్సవం' ఘనంగా నిర్వహించగా ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేస్తూ నిరంతరం శ్రమిస్తున్న పాఠశాలలోని 30 మంది ఉపాధ్యాయులను ఈ సందర్భంగా నిర్వాహకులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ బ్రాంచ్ మేనేజర్ కె. వీరస్వామి, ట్రైనర్ వర్మ, అసిస్టెంట్ మేనేజర్లు శ్రీకాంత్, విజయ్, పాఠశాల ప్రిన్సిపాల్ హర్జిత్ కౌర్, గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మొక్కలకు రక్షణ కరువు

- నీరుగారిపోయిన హరితహారం పథకం
- లక్షల రూపాయల నిధుల దుర్వినియోగం జరిగిందని ఆరోపించిన రవీందర్ గౌడ్

**హుస్నాబాద్ సెప్టెంబర్ రవీందర్ ప్రజా తీర్పు**




హుస్నాబాద్ మున్సిపాలిటీ పరిధిలో చెట్లు మొక్కలు నాటే కార్యక్రమం పేరిట ప్రతి సంవత్సరం లక్షల రూపాయల దుర్వినియోగం జరుగుతుందని బీఎస్పీ నియోజకవర్గ ఇన్చార్జి పచ్చిమట్ల రవీందర్ గౌడ్ ఆరోపించారు. మున్సిపాలిటీ ఏర్పడినప్పటి నుండి ఇప్పటివరకు మూడు నాలుగు కోట్ల రూపాయలు వృధా అయినట్లు తెలుస్తుందన్నారు. పేపర్ల మీదనే చెట్లు, మొక్కల సంఖ్య కనబడుతున్నాయి గాని హరితహారం పథకం, వన మహోత్సవం పథకంలో క్షేత్రస్థాయిలో హుస్నాబాద్ చుట్టుపక్కల పట్టణంలో పలు వీధులలో చెట్లు మొక్కలు నాటి వాటిని రక్షించకపోవడంతో ఎండకి ఎండి, మేకలు గొర్లు వివిధ పశువులు తినడం వల్ల ఈ పథకం నీరు గారి పోయిందన్నారు. మున్సిపాలిటీ నుండి ఇంటి బిల్లులు నల్ల బిల్లులు వివిధ బిల్లుల నిధులతో పేరిట నర్సరీలు నిర్వహించడమే కాకుండా రాష్ట్ర కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న నిధులతో ఏటా ఈ కార్యక్రమం చేయడం జరుగుతుందని అన్నారు. ప్రతి సంవత్సరం లక్షల అవినీతి జరుగుతున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. రోడ్ల మీద పెట్టడం, కరెంటు తీగల కింద పెట్టడం ఒక సరైన రోడ్ మ్యాప్ లేకుండా ఈ పథకాన్ని దుర్వినియోగం చేస్తున్నారని విమర్శించారు. మున్సిపల్ కమిషనర్ ప్రతి మొక్కను కాపాడే విధంగా చర్యలు తీసుకోవాలని అదేవిధంగా మెయిన్ రోడ్లకు నాటే మొక్కలను కనీసం 10 మీటర్ల దూరం ఉండే విధంగా చర్యలు తీసుకుని ప్రజల సొమ్ము దుర్వినియోగం కాకుండా చూడాలని , మొక్కలు నాటుకుంటూ ఫోటోలకు ఫోజులు ఇవ్వకుండా ఒక బాధ్యత కల నాయకులుగా , నాటిన మొక్కలను కాపాడాలని, అవినీతి జరగకుండా చూడాలని బీఎస్పి పార్టీ పక్షాన కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు శంకర్ ,సుధాకర్, రాజు తదితరులు పాల్గొన్నారు.



# బ్రిడ్జి నిర్మాణం చేపట్టి రాకపోకలకు అంతరాయం లేకుండా చేయాలి

### బీఆర్ఎస్ నాయకుడు మల్లికార్జున్

**హుస్నాబాద్ సెప్టెంబర్ 16 రవీందర్ ప్రజా తీర్పు**

తోటపల్లి - జనగామ కల్వర్టుకు ప్రజలు రాకపోకలు సాగించడానికి బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని బీఆర్ఎస్ నాయకుడు అయిలేని మల్లికార్జున్ రెడ్డి డిమాండ్ చేశారు. హుస్నాబాద్ మండలం తోటపల్లి గ్రామం నుండి అక్కన్నపేట మండలం జనగామ గ్రామానికి వెళ్లే దారి మధ్యలో ఉన్న వాగు ఇటీవల కురిసిన భారీ వర్షానికి వరద నీరు చేరి తెగిపోవడంతో రాకపోకలు స్తంభించాయి. దీంతో బుధవారం మల్లికార్జున్ రెడ్డి ఆ ప్రాంతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గత సంవత్సరం ముగ్గురు ప్రాణాలు కూడా కోల్పోయారని, అయినా ప్రభుత్వం మేల్కోలేదన్నారు. ఇప్పటికైనా మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక చొరవ తీసుకొని బ్రిడ్జ్ నిర్మాణం చేపట్టే విధంగా చర్యలు తీసుకొని ప్రజలకు, రైతులకు సౌకర్యం కల్పించాలన్నారు. వరద నీరు ఎక్కువగా ప్రవహించినప్పుడు వాగులో నుండి ప్రజలు,రైతులు రాకపోకలు సాగించాలంటే ఇబ్బందికరమైన పరిస్థితి ఉందని తక్షణమే మంత్రి దీనిపై దృష్టి సారించాలన్నారు. ఈ సందర్శనలో మల్లికార్జున్ రెడ్డి తో పాటు బీఆర్ఎస్ నాయకులు బానోత్ సంతోష్ నాయక్, మాటూరి రాజశేఖర్ గౌడ్ ఉన్నారు.



# మెగా ఉద్యోగ మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలి

- సూర్యాపేట జిల్లా ఎస్పి నరసింహా ఐపిఎస్..

**(అనంతుల శ్రీనివాస్ గౌడ్, ప్రజా తీర్పు సూర్యాపేట జిల్లా ప్రతినిధి) సెప్టెంబర్ 16**

సూర్యాపేట: ఈ నెల 19వ తేదీన కోదాడ పట్టణంలోని సిసి రెడ్డి కాన్వెంట్‌లో ప్రభుత్వం ఆధ్వర్యంలో, గౌరవ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గారి సారథ్యంలో నిర్వహించనున్న మెగా ఉద్యోగ మేళాను నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని, అవకాశాలను విజయాలుగా మార్చుకోవాలని సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ గారు సూచించారు. ఈ సందర్భంగా బుధవారం సూర్యాపేట పట్టణంలోని ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు మెగా ఉద్యోగ మేళాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఉద్యోగ మేళాకు సంబంధించిన అవగాహన పోస్టర్‌ను ఎస్పీ నరసింహ ఐపీఎస్ గారు అధికారులతో కలిసి ఆవిష్కరించారు. మెగా ఉద్యోగ మేళాలో వివిధ రంగాలకు చెందిన 300 వరకు ప్రముఖ సంస్థలు పాల్గొని ఉద్యోగ అవకాశాలను కల్పించనున్నందున, విద్యార్థులు, ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతీ యువకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఎస్పీ సూచించారు. ఉద్యోగ మేళాకు హాజరయ్యే అభ్యర్థులు ముందుగానే స్కానర్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. యువత తమ విద్యార్హతలు, నైపుణ్యాలకు అనుగుణంగా అందుబాటులో ఉన్న ఉద్యోగ అవకాశాలను పరిశీలించి, తగిన ఉద్యోగాన్ని సాధించేందుకు ఈ మెగా ఉద్యోగ మేళాను ఒక మంచి అవకాశంగా వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఇన్స్పెక్టర్ వెంకటయ్య, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు, కళాశాల ప్రినిస్పాల్ ముత్యాలరాజు, ఉపాధ్యాయులు, పోలీసు అధికారులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఇక డ్రగ్స్‌పై సమరమే..!

- మత్తు మహమ్మారిని నిర్వీర్యం చేయాల్సిన బాధ్యత అందరిదీ..!
- మన చుట్టూ డ్రగ్స్ ఆనవాళ్లు కనిపిస్తే మౌనం వద్దు.. ప్రతి పౌరుడు అప్రమత్తం కావాలి..!
- అనుమానం వచ్చిన వెంటనే 112కు సమాచారం.. ఒక్క సమాచారం ఒక జీవితాన్ని కాపాడుతుంది..!
- యువతను కాపాడటం పోలీసుల బాధ్యత మాత్రమే కాదు.. ప్రతి కుటుంబం, ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత..!



**(మొక్క ఉపేందర్, ప్రజాతీర్పు ప్రతినిధి హైదరాబాద్) సెప్టెంబర్, 16:**

మత్తు పదార్థాల మహమ్మారి యువత భవిష్యత్తును ఛిన్నాభిన్నం చేయకుండా సమాజం మొత్తం అప్రమత్తం కావాల్సిన సమయం ఆసన్నమైందని పోలీసులు పిలుపునిచ్చారు. డ్రగ్స్ అనేది కేవలం ఒక వ్యక్తి ఆరోగ్యాన్ని దెబ్బతీసే అలవాటు మాత్రమే కాదని, కుటుంబ ఆర్థిక పరిస్థితులు, మానవ సంబంధాలు, సామాజిక భద్రత, యువత భవిష్యత్తుపై ప్రభావం చూపే తీవ్రమైన సామాజిక సమస్య అని హెచ్చరించారు. మేడ్చల్--మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో మేడ్చల్ జిల్లా మల్కాజ్గిరి జిహెచ్‌ఎంసి ఉప్పల్ జోన్ ఘట్కేసర్ సర్కిల్ పోచారం పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్నోజిగూడ రాజీవ్ గృహకల్ప ఆర్.జి.కె. కాలనీలో మత్తు పదార్థాల దుష్ప్రభావాలు, డ్రగ్స్ నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు ప్రజలకు స్పష్టమైన సందేశాన్ని ఇచ్చారు. "డ్రగ్స్‌ను అరికట్టడం పోలీసుల ఒక్కరి బాధ్యత కాదు.. ప్రజలు భాగస్వాములైనప్పుడే మత్తు పదార్థాలపై సమర్థవంతమైన పోరాటం సాధ్యమవుతుంది" అని పేర్కొన్నారు.

**డ్రగ్స్‌పై సమరానికి ప్రజలే ముందుబాటులో నిలవాలి**

పోలీసు వ్యవస్థ ఎంత పటిష్టంగా ఉన్నప్పటికీ ప్రతి వీధి, ప్రతి కాలనీ, ప్రతి కుటుంబంలో చోటుచేసుకునే పరిణామాలను పోలీసులు నిరంతరం గుర్తించడం సాధ్యం కాదని అధికారులు తెలిపారు. అందువల్ల ప్రజల అప్రమత్తత, బాధ్యతాయుతమైన సమాచారం పోలీసులకు అత్యంత కీలకమని వివరించారు. కాలనీలో, ఇంటి చుట్టుపక్కల లేదా పరిసర ప్రాంతాల్లో ఎవరైనా మత్తు పదార్థాలను విక్రయిస్తున్నట్లు, వినియోగిస్తున్నట్లు లేదా అనుమానాస్పద కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు గుర్తిస్తే నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. అనుమానం వచ్చినా స్వయంగా ఎదుర్కొనవద్దు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దు. వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి. అత్యవసర పరిస్థితుల్లో 112కు కాల్ చేయాలి.

**ఒక్క ఫోన్ కాల్.. ఒక జీవితానికి రక్షణ**

డ్రగ్స్ అక్రమ రవాణా లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసినా "మనకెందుకు?" అనే ధోరణితో మౌనంగా ఉండటం సమాజానికి ప్రమాదకరమని పోలీసులు హెచ్చరించారు. ఒక సమాచారం ఒక యువకుడిని మత్తు బారి నుంచి బయటపడేయవచ్చు. ఒక ఫోన్ కాల్ ఒక కుటుంబాన్ని కన్నీటి నుంచి కాపాడవచ్చు. ఒక అప్రమత్తమైన పౌరుడు ఒక కాలనీ భవిష్యత్తును రక్షించగలడు. అందుకే డ్రగ్స్‌పై పోరాటాన్ని ప్రతి పౌరుడు తన సామాజిక బాధ్యతగా స్వీకరించాలని పిలుపునిచ్చారు.

**ఇంటి నుంచే అప్రమత్తత ప్రారంభం కావాలి**

యువతలో ప్రవర్తనా మార్పులు, చెడు స్నేహాలు, చదువు లేదా ఉద్యోగంపై ఆసక్తి తగ్గడం, కుటుంబ సభ్యులకు దూరంగా ఉండటం వంటి పరిణామాలను తల్లిదండ్రులు నిర్లక్ష్యం చేయకూడదని అధికారులు సూచించారు. అయితే ప్రతి ప్రవర్తనా మార్పును డ్రగ్స్ వినియోగంగా భావించకుండా, పిల్లలతో స్నేహపూర్వకంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకోవాలని సూచించారు. కుటుంబంలో ప్రేమ, నమ్మకం, పర్యవేక్షణ ఉంటే యువతను అనేక ప్రమాదాల నుంచి రక్షించవచ్చని తెలిపారు. సరదాగా మొదలై.. జీవితాన్నే మింగే వ్యసనం మత్తు పదార్థాల వినియోగం ఆసక్తి, సరదా లేదా స్నేహితుల ఒత్తిడి నుంచి ప్రారంభమై క్రమంగా వ్యసనంగా మారే ప్రమాదం ఉందని పోలీసులు హెచ్చరించారు. వ్యసనం పెరిగే కొద్దీ విద్య, ఉద్యోగం, ఆరోగ్యం, ఆర్థిక స్థిరత్వం, కుటుంబ సంబంధాలు దెబ్బతినే అవకాశం ఉందన్నారు. కొన్ని సందర్భాల్లో మత్తు పదార్థాల కోసం డబ్బు సమకూర్చుకునే ప్రయత్నంలో నేరాల వైపు మళ్లే ప్రమాదం కూడా ఉంటుందని వివరించారు. అందుకే యువతకు చిన్న వయస్సు నుంచే "డ్రగ్స్ కాదు.. లక్ష్యం కావాలి. మత్తు కాదు.. మంచి భవిష్యత్తు కావాలి" అనే ఆలోచనను పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు.

**యువత చేతిలో మత్తు పదార్థాలు కాదు.. పుస్తకాలు ఉండాలి..!**

దేశ భవిష్యత్తు యువత చేతుల్లో ఉందని, అలాంటి యువత మత్తు పదార్థాలకు బానిసైతే సమాజ అభివృద్ధికి తీవ్ర నష్టం కలుగుతుందని అధికారులు హెచ్చరించారు. యువత తమ శక్తి, ప్రతిభను విద్య, క్రీడలు, సాంకేతిక నైపుణ్యాలు, ఉపాధి, పరిశోధన, సామాజిక సేవ వంటి సానుకూల రంగాల వైపు మళ్లించాలని సూచించారు. యువత చేతిలో డ్రగ్స్ ఉండకూడదు.. పుస్తకం ఉండాలి. నేరానికి దారి ఉండకూడదు.. లక్ష్యానికి మార్గం ఉండాలి. నిరాశకు చోటుండకూడదు.. ఆత్మవిశ్వాసానికి స్థానం ఉండాలి. డ్రగ్స్ నిర్మూలన.. ఒక్కరోజు కార్యక్రమం కాదు డ్రగ్స్ నిర్మూలనను కేవలం ఒక అవగాహన కార్యక్రమానికి పరిమితం చేయకుండా నిరంతర సామాజిక ఉద్యమంగా మార్చాల్సిన అవసరం ఉందని అధికారులు స్పష్టం చేశారు. కాలనీ సంక్షేమ సంఘాలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, యువజన సంఘాలు, ప్రజాప్రతినిధులు, సామాజిక సంస్థలు, పోలీసులు సమన్వయంతో పనిచేసినప్పుడే మత్తు పదార్థాల వ్యాప్తిని అరికట్టేందుకు బలమైన వాతావరణం ఏర్పడుతుందని పేర్కొన్నారు. మత్తు పదార్థాలకు బానిసైన వారిని కేవలం నిందించడం కాకుండా, వారి సమస్యను గుర్తించి అవసరమైన సహకారం అందిస్తూ సాధారణ జీవితంలోకి తీసుకురావడానికి కుటుంబం, సమాజం, సంబంధిత నిపుణులు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల అప్రమత్తతే పోలీసులకు అసలైన బలం మత్తు పదార్థాలపై పోలీసులు తమ వంతు బాధ్యతను నిర్వర్తిస్తున్నప్పటికీ, ప్రజల సహకారం మరియు బాధ్యతాయుతమైన సమాచారం ఆ పోరాటాన్ని మరింత సమర్థవంతం చేస్తుందని అధికారులు తెలిపారు. అనుమానాస్పద కార్యకలాపాలను గుర్తించినప్పుడు వ్యక్తిగతంగా ఘర్షణకు దిగకుండా సంబంధిత పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ప్రజలు చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకుండా పోలీసులపై నమ్మకం ఉంచి సహకరించాలని కోరారు. డ్రగ్స్‌ను చూసి మౌనం వహించొద్దు.. మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా సమాజమే ఒకటిగా నిలవాలి..! ఆర్.జి.కె. యూత్ క్లబ్ యువత భాగస్వామ్యం డ్రగ్స్ నిర్మూలనలో పోలీసులతో పాటు స్థానిక యువత కూడా భాగస్వాములు కావాలనే ఉద్దేశంతో రాజీవ్ గృహకల్ప ఆర్.జి.కె. కాలనీ యూత్ క్లబ్ అధ్యక్షుడు కొమ్మూరి ప్రశాంత్ ఆధ్వర్యంలో యువత కార్యక్రమంలో పాల్గొన్నారు. యువతే ముందుకు వచ్చి మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా చైతన్యం తీసుకురావడం ద్వారా కాలనీని ఆరోగ్యకరమైన, సురక్షితమైన వాతావరణంగా తీర్చిదిద్దవచ్చని ఈ సందర్భంగా సందేశం ఇచ్చారు.

**సమాజం మేల్కొంటే.. డ్రగ్స్ ఓడిపోతాయి!**

డ్రగ్స్ నిర్మూలనకు కేవలం పోలీసు బలగాలు సరిపోవని, ప్రజా చైతన్యం, కుటుంబ బాధ్యత, యువతలో అవగాహన, పోలీసుల నిరంతర పర్యవేక్షణ సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని కార్యక్రమం ద్వారా సందేశం అందించారు.

మత్తు పదార్థాల రహిత కాలనీ మన లక్ష్యం. మత్తు పదార్థాల రహిత సమాజం మన సంకల్పం. ఆరోగ్యకరమైన యువత మన భవిష్యత్తు. సురక్షితమైన సమాజం మన బాధ్యత. డ్రగ్స్‌కు నో చెప్పండి.. జీవితానికి అవును చెప్పండి! సమాజం మేల్కొంటే డ్రగ్స్ ఓడిపోతాయి.. యువత మేల్కొంటే భవిష్యత్తు గెలుస్తుంది! పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు ఈ అవగాహన కార్యక్రమంలో ఎస్ఐపీ వెంకట్ రెడ్డి, ఎస్ఐపీ విజయ్ కృష్ణమూర్తి, ఈగల్ ఫోర్స్ ఎస్ఐ సైదులు, ఎస్‌బీ ఏఎస్ఐ ఆనంద్ గౌడ్, పోలీస్ కానిస్టేబుళ్లు నరేందర్ గౌడ్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి పోలీసులకు సహకరించాలని, యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడేందుకు ప్రతి కుటుంబం సామాజిక బాధ్యతతో ముందుకు రావాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఇది కేవలం పోలీసుల పోరాటం కాదు.. ఇది మన పిల్లల కోసం మన సమాజం చేసే సమరం..! మత్తుపై పోరాటం.. యువత భవిష్యత్తు కోసం ఉద్యమం..! ఈ కార్యక్రమాన్ని చోటకూరి నవీన్ కుమార్, రవీందర్, సతీష్, పవన్, అజయ్, నాగరాజు తదితరులు పాల్గొని డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కార్యక్రమానికి తమ మద్దతు తెలిపారు విజయవంతం చేశారు.

# సూర్యాపేట, పీఎం శ్రీ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో "ఎక్స్‌పర్ట్ టాక్ కార్యక్రమం

- ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా ఎస్పీ నరసింహ ఐపిఎస్ గారు.
- అవకాశాలను సద్వినియోగం చేసుకొని లక్ష్యాలను సాధించాలి.లి
- టెక్నాలజీని జ్ఞానానికి, లక్ష్య సాధనకు ఉపయోగించాలి.
- విద్యార్థి దశలో వేసుకునే మంచి పునాదులే భవిష్యత్తులో విజయాలకు బాటలు వేస్తాయని.లి
- సమాజానికి సేవ చేసే మహావృక్షాలుగా ఎదగాలి
- జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్

**(అనంతుల శ్రీనివాస్ గౌడ్, ప్రజా తీర్పు సూర్యాపేట జిల్లా ప్రతినిధి) సెప్టెంబర్ 16**




విద్యార్థులు నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించేందుకు నిరంతరం కృషి చేస్తూ, తమకు లభిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని, మేధస్సును, తెలివితేటలను సరైన మార్గంలో ఉపయోగించుకొని భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని సూర్యాపేట జిల్లా ఎస్పీ కె. నరసింహ ఐపీఎస్ గారు సూచించారు. సూర్యాపేటలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ హైస్కూల్లో నిర్వహించిన "ఎక్స్‌పర్ట్ టాక్" కార్యక్రమానికి జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ గారు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఎస్పీ గారు మాట్లాడుతూ.. విద్యార్థి దశలోనే జీవితానికి ఒక స్పష్టమైన లక్ష్యాన్ని ఏర్పరచుకొని, ఆ లక్ష్య సాధన కోసం క్రమశిక్షణతో నిరంతరం శ్రమించాలని సూచించారు. చదువు అనేది కేవలం ఉద్యోగం కోసం మాత్రమే కాకుండా, జీవితాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దుకునేందుకు ఉపయోగపడే గొప్ప సాధనం అని తెలిపారు. పీఎం శ్రీ పాఠశాలగా జిల్లా పరిషత్ హైస్కూల్ ఎంపిక కావడం విద్యార్థులకు ఎంతో మంచి అవకాశమని తెలిపారు. నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తున్న ఉపాధ్యాయులు, పాఠశాలలో అందుబాటులో ఉన్న విద్యా అవకాశాలను విద్యార్థులు పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు. పీఎం శ్రీ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు తమ అదృష్టాన్ని అవకాశంగా భావించి, దానిని విజయంగా మలుచుకోవాలని అన్నారు. పాఠశాలకు, తల్లిదండ్రులకు, తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థులు తమ తల్లిదండ్రుల ఆశయాలు, కలలను నెరవేర్చే దిశగా అనుక్షణం కృషి చేయాలని సూచించారు. మహానుభావులు, గొప్ప వ్యక్తుల జీవిత చరిత్రలు, వారి విజయాలను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని అన్నారు. "కలలు కనడం మాత్రమే కాదు.. ఆ కలలను సాకారం చేసుకునేందుకు క్రమశిక్షణతో సాధన చేయాలి" అని సూచించారు. విద్యార్థులు తమ మేధస్సును, తెలివితేటలను సరైన మార్గంలో ఉపయోగించుకొని భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని అన్నారు. ఆత్మన్యూనతా భావాన్ని విడిచిపెట్టి ఉత్సాహంగా, చలాకీగా ఉంటూ మంచి లక్ష్యాల వైపు అడుగులు వేయాలని సూచించారు. ప్రస్తుత కాలంలో సోషల్ మీడియా, సాంకేతిక పరిజ్ఞానం విద్యార్థుల జీవితాల్లో కీలక పాత్ర పోషిస్తున్నాయని ఎస్పీ తెలిపారు. అయితే సోషల్ మీడియా ప్రభావంతో చెడు అలవాట్లకు లోనుకావద్దని, టెక్నాలజీని చదువు, జ్ఞానం, నైపుణ్యాభివృద్ధి, లక్ష్య సాధనకు ఉపయోగించుకోవాలని సూచించారు. విద్యార్థి దశలో వేసుకునే మంచి పునాదులే భవిష్యత్తులో విజయాలకు బాటలు వేస్తాయని తెలిపారు.

### విద్యార్థులు సమాజానికి సేవ చేసే మహావృక్షాలుగా, వనరులుగా ఎదగాలి..

విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవడంతో పాటు సమాజానికి ఉపయోగపడే వ్యక్తులుగా ఎదగాలని ఎస్పీ ఆకాంక్షించారు. తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చడంతో పాటు తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర సాధన, మంచి ఆలోచనలతో ముందుకు సాగితే ఏ లక్ష్యాన్నైనా సాధించవచ్చని తెలిపారు. అవకాశాలు ప్రతి ఒక్కరి జీవితంలో వస్తాయని.. వాటిని గుర్తించి సద్వినియోగం చేసుకొని విజయాలుగా మలుచుకోవడం విద్యార్థుల చేతుల్లోనే ఉందని ఎస్పీ నరసింహ ఐపీఎస్ గారు తెలిపారు. విద్యార్థులు మహానుభావుల జీవితాలను స్ఫూర్తిగా తీసుకొని, తల్లిదండ్రుల అడుగుజాడల్లో నడుస్తూ, ఉపాధ్యాయులు నేర్పిన విద్యను అభ్యసిస్తూ, క్రమశిక్షణతో జీవిస్తూ తమకు, తమ కుటుంబానికి, పాఠశాలకు, సమాజానికి గర్వకారణంగా నిలిచేలా ఎదగాలని ఆకాంక్షించారు.

### మహిళలు, బాలికల రక్షణకు పోలీస్ శాఖ కృషి..

సమాజంలో మహిళలు, బాలికలకు ప్రత్యేక స్థానం ఉందని ఎస్పీ తెలిపారు. వారి భద్రత, రక్షణ కోసం పోలీస్ శాఖ అనుక్షణం కృషి చేస్తుందని చెప్పారు. మహిళలు, బాలికలకు ఏవైనా సమస్యలు ఎదురైతే పోలీసులను సంప్రదించాలని సూచించారు. షీ టీమ్స్, భరోసా కేంద్రాలు, పోలీస్ సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. మహిళలు, బాలికల సమస్యలను సొంత అక్కలా అర్థం చేసుకొని వారికి అండగా నిలిచే విధంగా పోలీస్ శాఖ పనిచేస్తుందని చెప్పారు. సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి. విద్యార్థులు సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. అపరిచిత వ్యక్తులకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటిపి, పిన్, పాస్‌వర్డ్, బ్యాంక్ వివరాలు వెల్లడించవద్దని తెలిపారు. అత్యాశకు గురికావద్దని, ఉచితాల పేరుతో వచ్చే సందేశాలు, అనుమానాస్పద లింకులు, ఆన్‌లైన్ ఆఫర్ల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. "తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వస్తాయని ఎవరైనా చెబితే, దాని వెనుక సైబర్ మోసం ఉండే అవకాశం ఉందని గుర్తించాలి" అని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించాలని సూచించారు.

### డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి..

విద్యార్థులు మత్తు పదార్థాలు, డ్రగ్స్‌కు పూర్తిగా దూరంగా ఉండాలని ఎస్పీ సూచించారు. డ్రగ్స్‌కు అలవాటు పడితే ఆరోగ్యం, చదువు, కుటుంబం, భవిష్యత్తు మొత్తం నష్టపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. తోటి విద్యార్థులతో స్నేహపూర్వకంగా మెలుగుతూ, ప్రతి ఒక్కరినీ గౌరవించాలని సూచించారు. చెడు స్నేహాలకు దూరంగా ఉండి, మంచి లక్ష్యాలు కలిగిన వారితో స్నేహం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ ప్రసన్న కుమార్, సిఐ వెంకటయ్య, సిసిఎస్ ఇన్స్పెక్టర్ శివ కుమార్, సైబర్ సెక్యూరిటీ ఇన్స్పెక్టర్ లక్ష్మీనారాయణ, ఎస్ఐ లు, యాదవేందర్ రెడ్డి, సాయిరాం, హరికృష్ణ, భరోసా ఎస్ఐ మౌనిక, షీ టీం ఎస్ఐ నీలిమ, పాఠశాల హెడ్ మాస్టర్ గోలి పద్మ, పిజికల్ డైరెక్టర్ విస్వజ్ఞా చారి, ఇంచార్జీ హెడ్ మాస్టర్ శ్రీనివాస్ రెడ్డి, సునీత, సుమతి, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ రావు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## యూపీఐ చెల్లింపులు ఆపేస్తాం!

ఒక్కో లావాదేవీకి రూ.5 చొప్పున స్థిరమైన మర్చంట్ డిస్కౌంట్ రేట్(ఎండీఆర్) చెల్లించాల్సి వస్తే ఇప్పటికే చాలా తక్కువగా ఉన్న తమ లాభాలపై అది మరింత భారం మోపుతుందని దేశవ్యాప్తంగా ఉన్న పెట్రోల్ పంప్ డీలర్లు ఆందోళన వ్యక్తం చేశారు. రూ.2 వేలు, అంతకంటే ఎక్కువ విలువైన యూపీఐ చెల్లింపులను స్వీకరించడం నిలిపివేసి, కేవలం నగదు లావాదేవీలకే పరిమితం అవుతామని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ప్రభుత్వం తన చమురు మార్కెటింగ్ కంపెనీల(ఓఎంసీ) ద్వారా లీటరుకు సుమారు రూ.2.40-3.40 లాభాన్ని తమకు నిర్దేశిస్తుందని, ఈ అతి తక్కువ లాభాలపై ఏ రూపంలోనైనా ఎండీఆర్ ఒక అదనపు భారం అవుతుందని ఢిల్లీ ఎన్‌సీఆర్, పంజాబ్, ఉత్తర్ ప్రదేశ్, ముంబై, కర్ణాటక, రాజస్థాన్‌కు చెందిన పెట్రోల్ పంప్ డీలర్లు తెలిపారు. ఇంధన రిటైలర్లకు మినహాయింపు ఇవ్వకపోతే రూ.2,000, అంతకంటే ఎక్కువ ఉన్న యూపీఐ చెల్లింపులను స్వీకరించడం మేము ఆపివేయాల్సి రావచ్చు అని ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా పెట్రోలియం ట్రేడర్స్(ఎఫ్ఏఐపీటీ) ప్రతినిధి మాంటీ సెహగల్ అన్నారు. పెట్రోలియం రిటైల్ అవుట్‌లెట్‌లను సాధారణ రిటైల్ వ్యాపారాలతో పోల్చలేమనే కారణంతో మినహాయింపు కోరుతూ అఖిల కర్ణాటక పెట్రోలియం ట్రేడర్స్ ఫెడరేషన్(ఏకేఎఫ్‌పీటీ) కేంద్ర ప్రభుత్వానికి, ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ సంస్థలకు లేఖ రాసింది. పెట్రోలియం డీలర్లు నిర్దేశిత డీలర్ కమీషన్, మార్జిన్ విధానం ప్రకారం కార్యకలాపాలు సాగిస్తారు.



## గణేశుని ఉత్సవాలలో డీజే సౌండ్స్ వినియోగించరాదు

- చిగురుమామిడి ఎస్ఐ జగదీశ్వర్
- 14 మంది డీజే ఆపరేటర్లు బైండోవర్.

**హుస్నాబాద్ సెప్టెంబర్ 16 రవీందర్ ప్రజా తీర్పు**

గణేష్ ఉత్సవాలలో డీజే సౌండ్స్ వినియోగించరాదని చిగురుమామిడి ఎస్సై జగదీశ్వర్ హెచ్చరించారు. గణేష్ నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ముందస్తు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. ఈ క్రమంలో డీజే సౌండ్ సిస్టమ్స్ నిర్వహించే 14 మంది డీజే ఆపరేటర్లను గుర్తించి, తాసిల్దార్ ఎదుట బైండోవర్ చేయడం జరిగిందని తెలిపారు. గణేష్ ఉత్సవాలు మరియు ఊరేగింపుల సమయంలో డీజే సౌండ్ సిస్టమ్స్ వినియోగించరాదని వారికి స్పష్టంగా సూచించడంతో పాటు, పోలీసుల ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని హెచ్చరించారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా వినాయక చవితి ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీస్ శాఖ తరపున అవసరమైన అన్ని ముందస్తు చర్యలు చేపడుతున్నామని తెలియజేశారు.



## మందకృష్ణ మాదిగ, ఆర్.కృష్ణయ్యలను కలిసిన సూర్యాపేట రైల్వే సాధన సమితి

- కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని నేతల హామీ
- రెండు నెలలుగా కొనసాగుతున్న రైల్వే ఉద్యమానికి సంఘీభావం

**(అనంతుల శ్రీనివాస్ గౌడ్, ప్రజా తీర్పు సూర్యాపేట జిల్లా ప్రతినిధి) సెప్టెంబర్ 16**

సూర్యాపేటకు సామాన్యుల రైలు సాధించేందుకు కొనసాగుతున్న ప్రజా ఉద్యమానికి సామాజిక ఉద్యమ నేతల మద్దతు లభించింది. సూర్యాపేట రైల్వే సాధన సమితి ప్రతినిధులు బుధవారం మాదిగ దండోరా వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ, రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు ఆర్.కృష్ణయ్యలను వేర్వేరుగా కలిసి రైల్వే సాధన ఉద్యమానికి సంఘీభావం ప్రకటించాలని కోరారు. సూర్యాపేటకు రైల్వే సౌకర్యం కల్పించాల్సిన అవసరాన్ని వివరిస్తూ వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఇరువురు నేతలు సానుకూలంగా స్పందిస్తూ, సూర్యాపేట రైల్వే అంశాన్ని కేంద్ర ఈప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని, సంబంధిత కేంద్ర మంత్రితో మాట్లాడతామని హామీ ఇచ్చినట్లు సమితి ప్రతినిధులు తెలిపారు.

## సేవాలాల్ సప్త.. నాల్గవ రోజు పూజలో పాల్గొన్న డిప్యూటీ డీఈఓ బానోత్ ఈరులాల్.

**నర్సంపేట 16 సెప్టెంబర్ (ప్రజా తీర్పు న్యూస్ ):**



నర్సంపేట: మాదన్నపేట రోడ్‌లో గోర్ శిక్వాడీ, గోర్ సేన ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏడు రోజుల "సేవాలాల్ సప్త" పూజా కార్యక్రమాలు భకి శ్రద్ధలతో కొనసాగుతున్నాయి. నాల్గవ రోజు నిర్వహించిన పూజా కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా డిప్యూటీ డీఈఓ బానోత్ ఈరులాల్ పాల్గొని సేవాలాల్ మహారాజ్‌ను దర్శించుకున్నారు. అనంతరం సేవాలాల్ మహారాజ్‌కు భోగ్ సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ సేవాలాల్ మహారాజ్ ఆశీస్సులతో గోర్ బంజారా సమాజంలో ఐక్యత, ఆధ్యాత్మిక చైతన్యం పెంపొందాలని ఆకాంక్షించారు. ఏడు రోజుల పాటు నిర్వహిస్తున్న సేవాలాల్ సప్త కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారు. ఈ కార్యక్రమంలో గోర్ గావణ్య బోడ కిషన్, సోప్తి గుగులోతు సుధాకర్, స్వామి, వరంగల్ జిల్లా గోర్ సేన అధ్యక్షుడు భూక్యా మత్రు, ఉపాధ్యక్షుడు లింగన్న, ప్రధాన కార్యదర్శి భూక్యా వెంకన్న రాథోడ్, బానోత్ సురేష్, బోడ సురేష్, బాబు తదితరులు పాల్గొన్నారు.

## క్రిప్టో వివాదం కిడ్నాప్ కేసులో ఏడుగురు అరెస్ట్

- రిమాండ్ కు తరలించిన డీ ఏస్ పి పురుషోత్తం రెడ్డి

**(కుమారస్వామి ప్రజా తీర్పు జగిత్యాల రూరల్ ) సెప్టెంబర్16**



జగిత్యాల జిల్లా క్రిప్టో పెట్టుబడులు, డబ్బుల లావాదేవీలకు సంబంధించిన వివాదంలో జగిత్యాల మండలం రూరల్ చల్గల్ గ్రామానికి చెందిన మారుతి అనే వ్యక్తి కిడ్నాప్‌కు గురైన ఘటనపై 7 గురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలిస్తున్నాం అని డీ ఏస్ పి పురుషోత్తం రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసినా పాత్రికేయుల సమావేశం లో డీ ఎస్పీ పురుషోత్తం రెడ్డి వివరాలను వెల్లడించినారు. బాధితుడి భార్య లావణ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. డబ్బులు, ఇంటి రిజిస్ట్రేషన్ కోసం మారుతిపై ఒత్తిడి తీసుకొచ్చినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. కత్తితో బెదిరించి దాడికి పాల్పడినట్లు కూడా ఆరోపణలు ఉన్నాయి.ఈ కేసులో బెజ్జంకి అనిల్ కుమార్ ,జగదీశ్వర్, నిఖిల్,దీక్షిత్, వంశీ, రెహమాన్, సాయి అనే 7 గురిని పట్టణ సి ఐ కరుణాకర్, ఎస్ ఐ కుమార స్వామి ఆధ్వర్యంలో నిందితులను అరెస్ట్ చేశారు అని డిఎస్పీ తెలిపారు.జగిత్యాల బైపాస్ వద్ద నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు వారి వద్ద నుంచి 3 కార్లు,10 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఫిబ్రవరి 19న మారుతిని కిడ్నాప్ చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైనట్లు సమాచారం. అయితే ఫిర్యాదు ఆలస్యంగా రావడంతో తాజాగా నిందితులను అరెస్ట్ చేసాం అని తెలిపారు. సంబంధిత క్రిప్టో కేసులు విషయం లో చాలా భాధితులు ఉన్నారని తేలినప్పటికి ఎవరైనా ముందుకు వచ్చి పిర్యాదు చేస్తే వారిపై చర్యలు తీసుకుంటాం అని తెలిపారు. బాధితులు బెజ్జంకి అనిల్ రావు ప్రభుత్వ ఉపాధ్యాయునిగా పని చేస్తూ క్రిప్టో కరెన్సీ బిజినెస్ లో చాలా మందితో పెట్టుబడి పెట్టించి వారికీ డబ్బు కట్టే ప్రక్రియ లో మారుతీతో విభేదాలు రావడం తో రౌడీ షీటర్లతో అతనిని కిడ్నాప్ చేసి బెదిరింపులకు పోల్పడినారు అని తెలిపారు. నిందితులను త్వరితంగా పట్టుకున్నశీదుకు సి ఐ, ఎస్ ఐ, సిబ్బందిని డిఎస్పీ అభినందించారు.

Edited Printed Published and Owned by SOYINENI MAHESH, **RNI Reg no. APTEL/2001/5268** printed at m/s Ganesh Printers Ramantapur Hyderabad, Published at m/s Bavani Publication Trust Plot No C-1/2c idl Uppal hydrabad-500039 Chieff Editor : S.Mahesh, 94946 59622, office : 8309979541, Admn office: 1-7-334 2nd floor Musherabad Hydrabad -500020